

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 29.10.2025 | సంపుటి : 2 | సంచిక :264 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | Wednesday | 29.10.2025 | volume : 2 | Issue : 264 | Pages : 8 | Cost : 2/-

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575


04

## మరింత తగ్గిన బంగారం ధర..
రూ.1.50 లక్షల దిగువకు వెండి


04

## కేంద్ర ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
8వ వేతన కమిషన్‌కు ఆమోదం

## తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు
# 80టీఎంసీలు
### నీటిని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయండి
### చేపట్టాల్సిన ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష

తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేం దుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.



**హైదరాబాద్, అక్టోబర్ 28 :** కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై మంగళవారం జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజె క్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.



## ఏఐ టెక్నాలజీతో అప్రమత్తం
### డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త
### సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సిపి సజ్జనార్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి.

-మిగతా 2 లో..

## ఎరువుల కంపెనీలకు
# న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ
### కంపెనీలకు రూ.37,952 కోట్ల చెల్లింపులు
### కేంద్ర కేబినేట్ నిర్ణయంపై కిషన్ రెడ్డి వివరణ

ఎరువుల ఉత్పత్తి కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయంపై.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం గత 11 ఏళ్లుగా కారక్రమాలు చేపడుతోందని తెలిపారు.

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 :** ఈ క్రమంలో మంగళవారం కేంద్ర కేబినెట్ మరో చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రైతులపై ఎరువుల ధరలు భారం పడకుండా, ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై ఆర్థిక భారాన్ని

-మిగతా 2 లో..





## కృత్రిమ వర్షానికి ఢిల్లీ రెడీ..
04
### క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ పూర్తి

దేశ రాజధాని ఢిల్లీని తీవ్ర వాయు కాలుష్యం వేధిస్తోంది. దీపా వళి అనంతరం పరిస్థితులు మరింత దిగజారాయి. మంగళవారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 306గా నమోదు అయినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. ఇది తీవ్రమైన కాలుష్య కేటగిరిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు స్థానికంగా కృత్రిమ వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది.



## హరీష్ రావుకు పితృవియోగం
తండ్రి సత్యానారాయణ కన్నుమూత

బావకు నివాళి అర్పించి..అక్కను ఓదార్చిన కెసిఆర్

కెటిఆర్, బిఆర్ఎస్ నేతల నివాళి

మంత్రులు పోన్నం తదితరుల నివాళి

సంతాపం తెలిపిన సిఎం రేవంత్, వైఎస్ జగన్

హైదరాబాద్, అక్టోబర్ 28 : సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై

-మిగతా 2 లో..



## సొంత జిల్లాకు అన్యాయం చేస్తున్న రేవంత్
పాలమూరు-రంగారెడ్డి పై నిర్లక్ష్యం

జిల్లా ప్రజలు రేవంత్‌ను క్షమించరు

జాగృతి జనంబాటలో కవిత డిమాండ్

**మహబూబ్‌నగర్, అక్టోబర్28 :** సొంత జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన కరివెన రిజర్వాయర్‌ను సందర్శించి కవిత మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చారిత్రక

# మావోయిస్టులకు భారీ దెబ్బ



పలువురు అగ్రనేతల లొంగుబాటు

డిజిపి శశిధర్ ఎదుట లొంగిపోయిన నేతలు

పుల్లూరి ప్రసాద్ రావు, బండిప్రకాశ్ లొంగుబాటు

లొంగిపోయిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటాం : డిజిపి

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** ఇప్పటి వరకు 427మంది లొంగిపోయారు. అందులో 8 మంది స్టేట్ కమిటీ, 2 సెంట్రల్ కమిటీ మెంబెర్లు లొంగిపోయారు. 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్టాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 20 మంది డిస్ట్రిక్ కమిటీ, 14

మావోయిస్టులకు మరో దెబ్బతగిలింది. పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపునిచ్చిన క్రమంలో రాష్ట్ర సర్కార్ పిలుపు మేరకు మావోయిస్టులు అజ్ఞాతం వీడారు. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న, చంద్రన్నా, మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబెర్ బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు. అయితే, పుల్లూరి ప్రసాద్ రావుపై రూ.25 లక్షలు రివార్డు ఉంది. బండి ప్రకాష్ అలియాస్ ప్రభాతలపై రూ.20 లక్షలు రివార్డు ఉంది. అయితే, అజ్ఞాతంలో 64 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు.



## మొంథా తీవ్ర తుపాను..
## పలు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ హెచ్చరికలు

**హైదరాబాద్,అక్టోబర్28:** మొంథా తీవ్ర తుపాను కాకినాడ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో వాతావరణశాఖ పలు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు ఉదయం వరకు గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖ, విజయ నగరం జిల్లాలతో పాటు తెలంగాణలోని భద్రదాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో, ఒడిశాలోని గజపతి, గంజాం జిల్లాల్లో ఆకస్మిక వరదలు( ఫ్లాష్ ఫ్లడ్స్) సంభవించే అవకాశముందని తెలిపింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో



# శృంగేరీ పీఠాధిపతిని కలుసుకున్న సిఎం రేవంత్

## వేములవాడ ఆలయ విస్తరణపై చర్చలు

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** హైదరాబాద్ పర్యటనలో ఉన్న శృంగేరీ పీఠం ఆచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామిని సిఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలసి శంకరమఠంలో వేంచేసి వున్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనతో వేములవాడ ఆలయ పునరుద్ధరణ పనులపై చర్చించారు. సంప్రదాయ దుస్తుల్లో వెళ్లి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే సిఎంకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు.



# సొంత జిల్లాకు అన్యాయం చేస్తున్న రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

అన్యాయం చేస్తున్నారని.. జిల్లా ప్రజలు ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ పార్టీని క్షమించరని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టలను సుప్రీంకోర్టు సస్పెన్షన్‌లో పెట్టినా.. రివ్యూ పిటిషన్ వేయకపోవటం దారుణమని మండిపడ్డారు. సీడబ్ల్యూసీ ప్రాజెక్టల పర్మిషన్ ఆపేసి లిస్ట్ లోంచి తీసేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవటం లేదన్నారు. వెంటనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చిన కవిత ప్రజలతో మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లాకు నీరిచ్చే వరప్రదాయని కృష్ణానది అని కొనియాడారు. తెలంగాణ సిద్దించిన తర్వాత అలాంటి కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ డిజైన్ చేసుకోవటం జరిగిందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 80 శాతం పూర్తి అయ్యాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా సరే ప్రాజెక్ట్ ఒక్క అడుగూ ముందుకుపడలేదని విమర్శించారు. ఉదండాపూర్, కరివెనలో ఒక తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లపూర్- ఏదుల టన్నెల్ పనులను చేయటం లేదన్నారు. ఒక పక్క ఉన్న నీళ్లను వాడుకోవటం లేదని.. మరో పక్క ఆల్మట్టి ఎత్తు పెంచితే మాట్లాడటం లేదని దుయ్యబట్టారు. తక్షణమే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలనికవిత డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. భూ నిర్వాసితులకు ఏ రోజు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందో ఆనాటి రేటు కట్టి ఇవ్వాలని చెప్పారు. 2021 నాటికే కటాఫ్ పెట్టటం సరికాదని.. పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పు బీఆర్ఎస్ చేసిందా? కాంగ్రెస్ చేసిందా? అని కాదని.. ఇక్కడ ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరగాలని మాత్రమే తాను ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగతా పనులు ఈ ప్రభుత్వం చేస్తుందా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. జనంబాటలో భాగంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులతో మాట్లాడారు. తెలంగాణ రాకముందు మహబూబ్ నగర్ లో నీళ్ల కరువు ఎలా ఉండేదో అందరికీ తెలుసని చెప్పారు. వందల ఎకరాలు ఉన్న వారు కూడా నీళ్లు లేక వలస పోయారని ఆనాటి రోజులను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారానీటి సమస్యలను అధిగమించామని చెప్పారు. కృష్ణా నది నీళ్లను వినియోగించుకోవాలని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ చేపట్టారని తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ సహా అన్ని పనులు 80 శాతం వరకు అప్పుడే పూర్తయ్యాయని అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. రేవంత్ రెడ్డి గెలిచి కూడా రెండేళ్లు అయ్యిందని చెప్పారు. ఇప్పటి వరకు ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ కోసం భూములు ఇవ్వటానికి ఇక్కడి ప్రజలు పెద్ద మనసు చేసుకొని ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నవీన్ యాదవ్ పక్కా లోకల్

## దండుపాళ్యం బ్యాచ్ అంటే దంచికొడతం

## జూబ్లీహిల్స్ ప్రచారంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్, అక్టోబర్ 28 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ పక్కా లోకల్ వ్యక్తి అని.. ఆయన గెలుపును ఎవరూ ఆపలేరని మంత్రి సీతక్క ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నిక దృష్ట్యా నియోజకవర్గం లోని బోరబండ డివిజన్ లో నవీన్ యాదవ్ కు మద్దతుగా సీతక్క విస్తృతంగా పర్యటించారు. నవీన్ యాదవ్‌ను పదే పదే రౌడీ షీటర్ అని బీఆర్ఎస్ వాళ్లు అనడం కరెక్ట్ కాదని అన్నారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో.. రెండేళ్లలో తామేం చేశామో ప్రజలకు అంతా తెలుసని అన్నారు. మరోసారి మా కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అంటే ఊరుకునే ప్రసక్తే లేదని.. దంచికొడతామని సీతక్క వార్నింగ్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో అధికార కాంగ్రెస్ పార్టీ స్పీడ్ పెంచింది. అన్ని డివిజన్ లలో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రతి డివిజన్‌లలో ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా ఇప్పటికే మంత్రులు ప్రచారంలో నిర్వహిస్తుండగా.. తాజాగా మంత్రులకు డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపును కాంక్షిస్తూ ప్రచారం మొదలుపెట్టారు. పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాలు చేస్తూ ప్రభుత్వ అభివృద్ధి పనులు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు తిప్పికొడుతూ తమ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరించనున్నారు.

# ఏఐ టెక్నాలజీతో అప్రమత్తం

- డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త
- సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సిపి సజ్జన్నార్



**హైదరాబాద్, అక్టోబర్ 28 :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి. కొంతమంది మోసగాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాల్సి ఉంటుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ ఈ విషయంలో ప్రజలకు హెచ్చరిక చేశారు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరమని అన్నారు. సేఫ్ వర్డ్ ఎలా ఉపయోగించాలంటే.. మీకు అత్యంత నమ్మకమైన వారితో ఒక ప్రత్యేక సేఫ్ వర్డ్ నిర్ణయించుకోండి. అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు ఆ వర్డ్ అడిగి ధృవీకరించండి. ఆ సేఫ్ వర్డ్‌ను బయట ఎవరితోనూ పంచుకోకండి. బ్యాంక్ వివరాలు, క్షిఖలు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ంఎ మన జీవితాన్ని సులభతరం చేస్తుంది, కానీ అదే మన భద్రతకు ప్రమాదం కావచ్చు. టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండటం, కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. 'సేఫ్ వర్డ్' వంటి చిన్న జాగ్రత్త ? పెద్ద ప్రమాదాల నుంచి మిమ్మల్ని కాపాడగలదన్నారు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచే ప్రయత్నంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఎక్స్ లో ఒక హెచ్చరిక పోస్టు చేశారు. ఎఐ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే జాగ్రత్త అవసరం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం 'సేఫ్ వర్డ్' విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒక చిన్న జాగ్రత్త ? పెద్ద మోసాల నుండి కాపాడుతుంది అంటూ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# హరీష్ రావుకు పితృవియోగం

(మొదటిపేజీ తరువాయి)



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చను న్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఇక హరీశ్‌రావును గుండెలకు హత్తుకుని కేసీఆర్ ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. హరీశ్ రావును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. హరీశ్ రావును ఓదార్చారు. సత్యనారాయణ రావు భౌతికకాయానికి నివాళు లర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, మెతుకు ఆనంద్, హరీశ్ రావును పరామర్శిం చారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు. అలాగే సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కటుఉంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఎపి మాజీ సిఎం జగన్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిన ప్రార్థించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

# మావోయిస్టులకు భారీ దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)



మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడ య్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ. 20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ. 25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదు. అవసరమైతే.. వారికి రక్షణ కల్పిస్తాం అని డీజీపీ తెలిపారు. మావోయిస్టులు చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుంచి బయటికి వచ్చి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. పుల్లూరి ప్రసాద్ రావ్ అ చంద్రన్నది పెద్దపల్లి మండలమని తెలపారు. చంద్రన్న15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు. మొదట రాడికల్ స్టూడెంట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారని వెల్లడించారు. 1980లో కిషన్‌జీకి కొరియర్‌గా చేశారని గుర్తుచేశారు. 2008లోనే కేంద్ర కమిటీ మెంబర్‌గా చంద్రన్న ఉన్నారని తెలిపా రు. 2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీగా ఉన్నారని వివరించారు. అక్టోబరు 21వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన స్రవంతిలో కలిశారని చెప్పుకొచ్చారు. చంద్రన్న ఆరోగ్యం కూడా సహకరించకాపోవడంతో అజ్ఞాతం వీడారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో చీలిక వచ్చిందని లొంగిపోయిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న తెలిపారు. తీవ్ర అనారోగ్య కారణాలతో తాను జనజీవన స్రవంతిలో కలిశానని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టు భావజాలానికి తానెప్పుడూ కూడా విజ్ఞుడేనని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో వచ్చిన విభేదాలు, చీలికల వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నక్సలైట్లు తమ సోదరులని.. లొంగిపోవాలని సీఎం పిలుపునిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపుమేరకు తాము ప్రజలతో కలిసి పని చేయాలని భావించామని పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు మేరకు సరెండర్ అయ్యామని పుల్లూరి ప్రసాద్ రావు స్పష్టం చేశారు.

# ఎరువుల కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ

(మొదటిపేజీ తరువాయి)

తగ్గించేందుకు రూ. 37,952 కోట్ల న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ కారణాలతో ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. ఈ ధరల ప్రభావం ఏమాత్రం రైతులపై పడకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు. ఈ ప్రయత్నంలో భాగంగా.. ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై పడుతున్న భారాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఇవాళ సమావేశమైన కేంద్ర కేబినెట్.. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి.. డై అల్యూమినియం ఫాస్ఫేట్ , మోనో అల్యూమినియం ఫాస్ఫేట్ , మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ , ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ , 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ , పొటాష్ డెరైవ్డ్ మొలాసెస్ , అల్యూమినియం సల్ఫేట్ వంటి దాదాపు 28 ఫెర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని వివరించారు కిషన్‌రెడ్డి. ఇందుకోసం.. అంతర్జాతీయంగా పెరిగిన ధరలతో ఈ ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై భారం పడకుండా.. రబీ సీజన్ కోసం రూ. 37,952 కోట్లు కేటాయిస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. ఇది ఎరువులు ఉత్పత్తి కంపెనీలకు కూడా భారం పడకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పుకొచ్చారు.

# మొంథా తీవ్ర తుపాను..

## పలు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ హెచ్చరికలు

(మొదటిపేజీ తరువాయి)

మొంథా తీవ్ర తుపాను ప్రస్తుతం విశాఖకు దక్షిణంగా 280 కి.మీ, కాకినాడకు ఆగ్నేయంగా 190 కి.మీ, మచిలీపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 110 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. గడిచిన 6 గంటల్లో 15 కి.మీ వేగంతో కదులుతున్నట్టు వాతావరణశాఖ తెలిపింది. ఇది ఉత్తర వాయవ్యంగా కదిలి.. కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది.

# తెలుగు రాష్ట్రాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

**ఢిల్లీ:** 'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగురాష్ట్రాల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై నివేదిక కోరారు. తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర వేళల్లో సత్వరం స్పందించాలన్నారు.

# జలమార్గాల అభివృద్ధిపై ఎంఓయూ

**అమరావతి, అక్టోబర్ 28 :** రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎంవోయూ కుదిరింది. రాష్ట్రంలో రూ. 150 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఒప్పందంలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్రంలో అంతర్గత జలమార్గాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా నిధులు వెచ్చించనుంది. ముంబయిలో జరుగుతోన్న ఇండియా మారిటైమ్ వీక్ -2025లో ఈ ఒప్పందం కుదిరింది. ఇన్ ల్యాండ్ వాటర్ వే అథారిటీ ఆఫ్ ఇండియాతో ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఎంవోయూ కుదుర్చుకుంది. మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పరస్పరం ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో అంతర్గత జల మార్గాల అభివృద్ధి చెందుతాయని రోడ్లు భవనాలు, పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధితో సరకు రవాణా వ్యయం భారీగా తగ్గనుందని మంత్రి తెలిపారు.

# శాతవాహనకు ఇక జనగామలో స్టాప్

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ-సికింద్రాబాద్- విజయవాడ మధ్య రెగ్యులర్‌గా సర్వీసులందిస్తోన్న శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు స్టాపేజీ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 30 నుంచి ప్రయోగాత్మకంగా ఈ రైలు జనగామ రైల్వే స్టేషన్‌లో ఆగుతుందని తెలిపింది. విజయవాడ-సికింద్రాబాద్ (12713) శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం క నిమిషం పాటు; సికింద్రాబాద్- విజయవాడ రైలు (12714) సాయంత్రం 5.19/5.20 గంటల మధ్య జనగామ రైల్వే స్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# తుఫాన్ ప్రభావంతో పశుగ్రాసం సిద్ధం

## మేతకు ఇబ్బంది రాకుండా ముందస్తు చర్యలు

**అమరావతి, అక్టోబర్ 28 :** మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్త మైంది. తీవ్ర తుపాను కోస్తాంధ్రలోని విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభావం చూపనున్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వర్షప్రభావం రీత్యా 865 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని అధికారులు సిద్ధం చేశారు. తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 38 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. 1.38 లక్షల హెక్టార్ల ఉద్యాన పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నెల్లూరు జిల్లా ఉలవపాడు 12.6 సెంటిమీటర్లు, సింగరాయకొండలో 10.5 సెంటీ మీటర్లు, కావలిలో 12.2, దగదర్తిలో 12, బి.కోడూరులో 6, కళింగపట్నంలో 7, విశాఖపట్నం, తునిలో 2 సెంటిమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 403 మండలాలపై మొంథా తుపాను ప్రభావం ఉండనుందని, అత్యవసర పరిస్థితి ఎదుర్కోనేలా మండలాల వారీగా 488 కంట్రోల్ రూమ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 1204 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 75,802 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.

# సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే
# కార్మికులకు 20 శాతం వాటా

- సినీ కార్మికులకు అండగా ప్రభుత్వం
- ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు
- ఆస్కార్ స్థాయికి సినీ పరిశ్రమను తీసుకెళ్లిన ఘనత మీదే
- సినీకార్మిక సంఘం సన్మాన సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 28 :** ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి కృష్ణానగర్‌కు వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు.

నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫైటర్స్, టెక్నీషియన్ల నైపుణ్యం పెంచేందుకు ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటి ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు. ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్. 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు , పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

- గేమ్‌ఛేంజర్‌గా యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వచ్చే ఏడు నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

**ఖమ్మం, అక్టోబర్ 28 :** రాష్ట్ర విద్యా వ్యవస్థను గేమ్ చేంజర్‌గా మార్చే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మధిర క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో విద్యా రంగంపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యా రంగంలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలవాలన్న దృష్టితో సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. ఆ దిశగా ఆర్థికశాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు.గ్రామీణ యువత పోటీ పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లి ఖర్చులు పెట్టాల్సిన అవసరం లేకుండా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డిజిటల్ లైబ్రరీ, నిష్ణాతులైన అధ్యాపకులచే ఆన్‌లైన్ కోచింగ్, పోటీ పరీక్షలకు అవసరమైన మొత్తం స్టడీ మెటీరియల్ ఈ సెంటర్లలో అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో ఐదు ప్రదేశాల్లో ఇవి ప్రారంభించేందుకు చర్యలు వేగవంతం చేశామని చెప్పారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అందించేందుకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని భట్టి ప్రకటించారు. మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా, పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి మండలంలో మూడు ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, బోధనా సౌకర్యాలు పెంచుతున్నామని స్పష్టం చేశారు. ప్రతి పది గ్రామాలకు ఒక పాఠశాలను గుర్తించి అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్థానిక సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించే విధంగా సూచనలు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల పైన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసి విద్యుత్‌లో స్వయం సమృద్ధిని సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికపై కాంగ్రెస్ వ్యూహం

### డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. ప్రతి డివిజన్ వారీగా మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉప ఎన్నికలో ప్రతి ఓటు కీలకమని భావించిన సీఎం, బలమైన మంత్రులను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో రహమత్‌నగర్ డివిజన్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను నియమించారు. బోరబండ డివిజన్ బాధ్యతలు సీతక్క, మల్లు రవికి అప్పగించారు. వెంగళ్ రావునగర్ డివిజన్‌లో తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సమన్వయం చేస్తారు. సోమాజిగూడ డివిజన్ పర్యవేక్షణ బాధ్యతలు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ వహించనున్నారు. షేక్‌పేట డివిజన్ బాధ్యతలు కొండా సురేఖ, వివేక్ తీసుకుంటారు. ఎర్రగడ్డ డివిజన్‌ను దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు చూసుకుంటారు. అలాగే యూసుఫ్‌గూడ డివిజన్ పర్యవేక్షణ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నంలకు అప్పగించారు. ఉప ఎన్నికలో సమన్వయం, ప్రచార వ్యూహం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలను ప్రతి మంత్రి స్థాయిలో పర్యవేక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెట్టండి

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లతో ఒరింగేదేమీ లేదు
- అభివృద్ధి కావాలంటే బిజెపి అభ్యర్థిని గెలిపించాలి
- ప్రచారంలో ఎంపి ఈటెల రాజేందర్ పిలుపు




**హైదరాబాద్, అక్టోబర్ 28 :** జూబ్లీహిల్స్ అంటే హైదరాబాద్‌లో రిచెస్ట్ ప్లేస్ కానీ ఈ నియోజకవర్గం లోని బస్తీల ప్రజల బాధలు మాత్రం వర్ణనాతీతమని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా మంగళవారం ఆయన నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో ఆ రెండు పార్టీలను బొందపెడితేనే చలనం వస్తుందని ప్రజలకు సూచించారు. పెన్షన్లు రావాలన్నా, డబుల్ బెడ్ రూం ఇళ్లు రావాలన్నా, మురికి కాలువలు కట్టాలన్నా, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే వారి మెడలు వంచి బీజేపీ కొట్లాడుతుందని ఎంపీ ఈటల స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి ఓటు వేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీపక్ రెడ్డి ఇప్పటికే ఇక్కడ పోటీ చేసి ఉన్నారని గుర్తు చేశారు. ఆ క్రమంలో ఆయన అందరికి సుపరిచితుడన్నారు. తాను మూడవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నానన్నారు. అయితే పేరుకే జూబ్లీహిల్స్.. పారే మురికి కాలువలు, కంపు వాసనలు, గతుకుల రోడ్లు ఏ పేదవాడిని కదిలించినా మమ్మల్ని పట్టించుకునే వారే లేరని ఆవేదన చెందుతున్నారని తెలిపారు. భర్త చనిపోయి ఐదేళ్లు అయినా.. 65 ఏళ్ళు దాటినా తమకు పెన్షన్ రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో టిఆర్ఎస్ పార్టీ ఇస్తామంటూ మోసం చేసిందని.. ఇవన్నీ ఇస్తారని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఆ పార్టీ సైతం తమను మోసం చేసిందని ప్రజలు మండిపడుతున్నారని చెప్పారు. పెన్షన్లు లేవు, ఇళ్లు లేవు, మురికి కాల్వలు సరిగా లేవు, తాగే నీరు సైతం సరిగ్గా రావడం లేదని బస్తీల ప్రజలు చెబుతున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టామని.. కాంగ్రెస్ పార్టీకి సైతం అదే గతి పడుతుందని వారు అంటున్నారని చెప్పారు. 40 ఏళ్ల క్రితం ఎలా ఉందో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అలాగే ఉందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. మంత్రుల మధ్య సమన్వయం లేదని చెప్పారు. మంత్రులకు డబ్బులు సంపాదించుకోవడానికి, దోచుకోవడానికే సమయం సరిపోతుంది తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సమస్యలపై అసెంబ్లీ వేదికగా కొట్లాడుతున్నది బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇది కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తమ పార్టీ కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, లీడర్లు ఇలా ప్రతి ఇంటికి వెళ్ళి ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు.

## కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా

- లేదంటే కెటిఆర్, హరీష్ రావు వీడుతారా
- జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ సవాల్



**హైదరాబాద్, అక్టోబర్ 28 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై బీఆర్ఎస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా నవీన్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులకి గట్టి సవాల్ విసిరారు. తన మీద పెట్టిన కేసులు నిజమైతే తాను రాజకీయాలని వదిలి.. హైదరాబాద్ విడిచి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. కానీ ఆ కేసులు ఫాల్స్ అని తేలితే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వం తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై ఒకే సంవత్సరంలో 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టిందని ధ్వజమెత్తారు. తన మీద రౌడీ అని ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని విమర్శించారు నవీన్ యాదవ్. తనకు న్యాయవ్యవస్థ నమ్మకం కలిగించిందని.. తనను కాపాడిందని ఉద్ఘాటించారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసు నమోదైందని తెలిపారు. పోలీసులు ఈ విషయంపై చర్య తీసుకుంటారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పైన విశ్వాసం ఉంచారని నవీన్ యాదవ్ నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో ప్రచార కార్యక్రమాలు రద్దు చేసుకున్న బిఆర్ఎస్

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాటి పార్టీ కార్యక్రమాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రద్దు చేశారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన భౌతికకాయానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

### వర్క్‌ఫ్రం హెూం చేస్తుండగా విద్యుదాఘాతం

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



**ఆత్మకూరు(ఎం):** విద్యుదాఘాతంతో వర్క్ ఫ్రం హెూం చేస్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ విషాద ఘటన మంగళవారం ఉదయం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం లింగరాజుపల్లిలో చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో భూషి గణేశ్(26)మృతి చెందగా, ఆయన తండ్రి నర్సింహకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరులోని ఓ సంస్థలో గణేశ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. కొన్ని రోజులుగా వర్క్ ఫ్రమ్ హెూం చేస్తున్నాడు. ఇటీవల వారి ఇంటి గోడలకు సిమెంట్ ప్లాస్టరింగ్ పనులు చేయించారు. పనుల కోసం ఏర్పాటు చేసిన ఇనుప పైపులను తొలగిస్తున్న క్రమంలో గోడ పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు ఇనుపపైపు తాకడంతో విద్యుదాఘాతం జరిగింది. ఈ ప్రమాదంలో గణేశ్ తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మరణించాడు. ఒకే ఒక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

## విపక్షాలవి బూటకపు హామీలు

- ఇంటికో ఉద్యోగం అంటూ మభ్య పెట్టే యత్నం
- మహాఘట్‌బంధన్ మేనిఫెస్టోపై నితీశ్ విమర్శలు

**పాట్నా, అక్టోబర్ 28 :** ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి పేరుతో విపక్షాలు బూటకపు వాగ్దానాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు. ఇంటింటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగమంటూ విపక్ష 'మహాగట్‌బంధన్' మంగళవారం నాడు విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో విపక్షాల తప్పుడు వాగ్దానాలు చేస్తున్నాయంటూ నితీష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శించారు. 'మహాకూటమి ప్రభుత్వం 15 ఏళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉంది. అప్పుడు యువతకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదు. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారు. విపక్షాల చెబుతున్న మాయమాటల భ్రమలో పడవద్దని ప్రజలను కోరుతున్నారు. మా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తుంచుకోండి. ఇకముందు కూడా అభివృద్ధిని కొనసాగిస్తాం. చేసిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తాం' అని నితీష్ పేర్కొన్నారు. బిహార్‌లో 2005కు ముందు నిరక్షరాస్యత, నిరుద్యోగత, వలసలు ఉండేవని.. ఉన్నత విద్య కోసం ఒక్క మంచి విద్యాసంస్థ కూడా ఉండేది కాదని, యువత చీకట్లో మగ్గేదని నితీష్ గుర్తుచేశారు. యువకులు ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వెళ్లి అక్కడ అవమానాలు పాలయ్యేవారని చెప్పారు. ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేసేవారు కాదని, ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉండేదని అన్నారు. పనిచేసే వాతావరణం కానీ, సౌకర్యాలు కానీ, నెలవారీ జీతాలు, పింఛన్లు వచ్చేవి కావని తెలిపారు. జీతాల కోసం ఆరు నెలలపాటు ఎదురు చూపులు, వేతనాలు, పెన్షన్ల కోసం నిరసనలు చోటుచేసుకునేవని అన్నారు. ఇప్పుడు అదే వ్యక్తులు అధికారం కోసం తప్పుడు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 2005 నుంచి 2020 వరకూ 8 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు.

## 17శాతం ఉన్నా సిఎంగా అవకాశం ఏదీ

- ఎన్‌డిఎ, ఇండియా కూటముల మోసపూరిత రాజకీయం
- బీహార్ ఎన్నికల ప్రచారంలో ఓవైసీ విమర్శలు



**పాట్నా, అక్టోబర్ 28 :** బిహార్ జనాభాలో 17 శాతం మైనారిటీలు ఉన్నప్పటికీ ముస్లిం ముఖ్యమంత్రి ఎందుకు లేరని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ఇటు ఎన్డీయే, అటు 'ఇండియా' కూటమి ముస్లింలను మోసగిస్తున్నాయని విమర్శించారు. గోపాల్ గంజ్ నుంచి బిహార్ ఎన్నికల ప్రచారానికి ఒవైసీ మంగళవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 32 నియోజకవర్గాల్లో ఎంఐఎం పోటీ చేస్తోంది. 'రాష్ట్ర జనాభాలో 17 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముస్లింలు ఎందుకు సీఎం కాకూడదు? జనాభాలో 3 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీ ఇస్తే దానితోనే సరిపుచ్చుకోవాలని అనుకుంటున్నారు' అని ఒవైసీ అన్నారు. ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిషాద్ నేత ముఖేష్ సహానిని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇటీవల ప్రకటించారు. సమాజంలోని ఇతర వర్గాలతో పాటు ముస్లింలకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీపై మైనారిటీల్లో ఉన్న భయాన్ని ఆసరాగా తీసుకుని కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు ముస్లిం ఓట్లకు గాలం వేస్తున్నాయని, అయితే ఈ పార్టీలు బీజేపీని అడ్డుకోలేవని ఒవైసీ అన్నారు. టిక్కెట్ల పంపిణీలో జనాభా ప్రాతిపదికన టిక్కెట్లు ఇవ్వలేని అవకాశవాద పార్టీల మాయలో పడవద్దని అన్నారు. ముస్లిం కమ్యూనిటీ సొంతంగా నాయకత్వాన్ని పటిష్టం చేసుకోవాలని సూచించారు. కేంద్రంలోని బేజేపీపైనా ఒవైసీ విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నివర్గాల ప్రగతి కోసం పాటుపడుతున్నామని చెబుతుంటారని, కానీ ఆయన పార్టీ ఒక్క ముస్లింకు కూడా ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదని ఆక్షేపణ తెలిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం పదపదే చొరబాటుదారుల ప్రస్తావన చేస్తూ మైనారిటీలను విమర్శిస్తుంటారని, ఇంతపెద్ద ఎస్ఐఆర్ చేపట్టి ఎంతమంది చొరబాటుదారులను నిలువరించారో చెప్పాలని అన్నారు. అమిత్‌షా మంత్రిత్వ శాఖ పరిధిలోని బీఎస్ఎఫ్ దేశ సరిహద్దులో మోహరించి ఉండగా చొరబాట్లు ఎలా కొనసాగుతున్నాయో చెప్పాలన్నారు. ఈ అంశాలపై అసెంబ్లీలో బిహార్ ముస్లింలు నిలదీయాలను కుంటే ఎఐఎంఐఎం పతంగి గుర్తుకు ఓటేయాలని కోరారు. మోదీ మనసు అహ్మదాబాద్‌పై, నితీష్ మనసు రాజ్‌గిర్‌పై, లాలూ మనసు ఆయన కొడుకుపైనా ఉంటుందని, సామాన్య ప్రజానీకం గురంచి వారికి ఆలోచనే లేదని ఒవైసీ విమర్శించారు.

## 1.27 ఎకరాల పార్క్ స్థలానికి విముక్తి

### కబ్జా చెరనుంచి విడిపించిన హైడ్రా

**హైదరాబాద్, అక్టోబర్ 28 :** అక్రమ కట్టడాలు కూల్చేవేతే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఆ దిశగా దూసుకుపోతోంది. మంగళవారం నగరంలో వేర్వేరు చోట్ల ఆక్రమణలు తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్క్ కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని గ్రహించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారు లే ఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించారు. పేదల అవసరాల కోసం కేటాయించబడిన ఈ లేఔట్‌లో బడాబాబు పాగా వేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని మార్చాడు. ఇలా ఆక్రమణలకు గురైన స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది.

# ఎల్ఐసి ఉనికికే ప్రమాదం!




ఆదానీతో మోడీ బంధం ఎంతో బలమైనది. అది ఫెవికాల్ లాంటిది. దానిని విడదీయడం అంత సులువు కాదు. గత పదేళ్లుగా ఇది రుజువైన విషయం. ఆదానీ కంపెనీపై వరుసగా విమర్శలు వస్తున్నా ..ఏనాడూ చర్యలు తీసుకోలేదు. సరికదా ఖండించడానికి కూడా ప్రధాని మోడీ పెదవి విప్పలేదు. ఆదానీ వ్యవహారంపై గతంలో పార్లమెంట్ స్తంభించింది. ఆదానీ గ్రూపు ఆర్థిక అవతవకలు, అమెరికా సంస్థ ఆరోపణలు అలా ఉండగానే తాజాగా ఆ కంపెనీకి ఎల్ఐసి మొత్తాన్ని ధారపోసారు.గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిచింది. ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ ఎల్ఐసిని అదానీ ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం బలి పెట్టడంపై వస్తున్న విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు. అంటే ప్రధాని మోడీ తన ప్రధాని పదవిని అడ్డం పెట్టి ఆదానీకి అండగా నిలబడ్డారని వేరుగా చెప్పనక్కరలేదు. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. నిజానికి గతంలోనే ఎల్ఐసిని ప్రైవేటీకరించాలని చూశారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సైతం ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేశారు. కానీ బిజెపికి పూర్తి మెజార్టీ రాకపోవడం, ఎపిలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఆగిపోయింది. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తే ఆదానికి అప్పగించేవారేమో అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. దేశీయంగా ఉన్న కంపెనీలను ఇలా తన తాబేదార్లకు కట్టబెట్టే కుట్ర లోపాయకారిగా జరుగుతున్నదని ప్రజలు గుర్తించాలి. ఎల్ఐసి మొత్తాలను ఆదానికి అప్పుగా బదిలీ చేయడం పై దేశంలో అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షు డు మల్లికార్జున ఖర్గే, తెలుగు రాష్ట్రాల్లో లెఫ్ట్ నేతలు కూనంనేని సాంబశివరావు, బివి రాఘవులు వంటివారు, మరికొందరు నిరస నల గళం విప్పారు. బీహార్ ఎన్నికల సందడిలో ఇదంతా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతోంది. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొ త్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్లించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందన్నది చెప్పకనే చెప్పవచ్చు.

అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమ యంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు అంటే 33 వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల దాదాపు రూ.5,000 కోట్లు బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపి యన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంట ర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొం దించారో తేటతెల్లమవుతుంది. ఆదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైందని అర్థం అవుతోంది. మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకంలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్‌లో 750 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6,650 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఆదానీ ఆర్థిక అక్రమాలు,

అవినీతిపై 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని బుకాయించింది. అందువల్ల ఎల్ఐసిలో ఏం జరుగుతుందో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం అవసరమన్న డిమాండ్‌ను కూడా ఆమోదిం చాలి. ఇంతపెద్ద మొత్తంలో వ్యవహారం గుంభనంగా సాగడాన్ని అడ్డుకోవాలి. ఎల్ఐసిని మరోమారు ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రలో కూడా ఇదో భగంగా చూడాలి. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరచాలి. పాలకుల కార్పొరేట్ అనుకూల నిర్ణయాలపై నిలదీయాలి. లేకుంటే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ కావడం ఖాయం. దీనిపై విపక్ష కాంగ్రెస్ గట్టిగా నిలబడాలి. నిజానిజాలను వెల్లడించేందుకు పోరాటం చేయాలి. ఓట్ చోరీ పక్కన పెట్టి ఎల్ఐసిని రక్షించే పోరాటానికి దిగాలి. అందుకు దేశంలోని ప్రజలు కూడా అడుగులు వేయాలి.

# బీహార్‌లో ఇంటికో ఉద్యోగం

- అధికారంలోకి రాగానే అమలు
- బిహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర విడుదల
- మహాఘట్‌బంధన్ మేనిఫెస్టో విడుదలలో తేజస్వి



**పాట్నా, అక్టోబర్ 28 :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విపక్ష మహాగట్‌బంధన్ మంగళవారం నాడు విడుదల చేసింది. 'బిహార్ కా తేజస్వి ప్రణ్ పత్ర'అనే టైటిల్‌తో ఆర్జేడీ నేత, కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. 'నూతన, అభివృద్ధి చెందిన బిహార్' తమ విజన్ అంటూ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని మేనిఫెస్టో వాగ్దానం చేసింది. 20 రోజుల్లో ప్రతి కుటుంబంలోని ఒక వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తెలిపింది. జీవికా దీదీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా శాశ్వత హోదా కల్పిస్తామని ప్రకటించింది. కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను పెర్మనెంట్ చేస్తామని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తీసుకువస్తామని తెలిపింది. రైతులు పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధర ఇస్తామని, మండీ, మార్కెట్ కమిటీలు పునరుద్ధరిస్తామని పేర్కొంది. జన్ స్వాస్థ్య సురక్ష యోజన కింద ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తామని, జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్‌ను పెంచుతామని హామీ ఇచ్చింది. తేజస్వి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్డీయే నేతల ప్రసంగాలు వినే ఉంటారని, ఒక్క నేత కూడా బీహార్‌ను ఎలా మందుకు తీసుకువెళ్తారో చెప్పడం లేదని అన్నారు. నితీష్‌కుమార్‌ను ఎన్డీయే కీలుబొమ్మగా పేర్కొన్నారు. బిహార్ సీఎం నితీష్‌కుమార్‌ను ఎన్నికల కోసమే బీజేపీ వాడుకుంటోందని, నితీష్ బిహార్ సీఎం కారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇప్పటికే ధ్రువీకరించారని, ఎన్నికల తర్వాత బీజేపీ నితీష్‌ను సీఎం చేసే ప్రసక్తే లేదని అన్నారు. ఇండియా కూటమి తనను సీఎం అభ్యర్థిగా ప్రకటించిందని, కానీ ఎన్డీయే ఒక్క మీడియా సమావేశంలో కూడా తమ సీఎం అభ్యర్థి ఎవరో ప్రకటించలేదని అన్నారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాగట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగా తామే ప్రకటించామని, ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోను కూడా మొదటగా తాము విడుదల చేశామని చెప్పారు. దీనిని బట్టే బిహార్ విషయంలో తామెంతో కృతనిశ్చయంతో ఉన్నామో అర్థం చేసుకోవచ్చన్నారు. తొలి రోజు నుంచి బిహార్‌కు ఏమి చేయదలచుకున్నామో డిసైడ్ చేసుకున్నామని, బిహార్‌కు తిరిగి పట్టాలపైకి తీసుకువస్తామని చెప్పారు. మహాగట్‌బంధన్ 'ప్రాణ పత్ర' కోసం బిహార్ రాష్ట్రం ఎదురుచూస్తోందని, ఈరోజు తమకు శుభదినమని అన్నారు. మహాగట్‌బంధన్ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముఖష్ సహనీ మాట్లాడుతూ, నవీన బీహార్ కోసం సంకల్ప పత్రాన్ని ఈరోజు విడుదల చేశామని, రాబోయే 30-35 సంవత్సరాల పాటు బిహార్ ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను తాము నెరవేరుస్తామని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని వాగ్దానం చేశారు. రాష్ట్ర ప్రజలంతా మహాగట్‌బంధన్‌కు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్డీయేకు ఎలాంటి సంకల్పం లేదని, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని హాగట్‌బంధన్ ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## డాక్టర్ ఆత్మహత్య కేసులో కొత్త విషయాలు

- ప్రశాంత్ బంకర్ అనే టెక్కీకి కూడా భాగస్వామ్యం
- ఆ దిశగా పోలీసుల ముమ్మర దర్యాప్తు

**ముంబై, అక్టోబర్ 28 :** మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న మహిళా డాక్టర్ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వైద్యురాలి ఆత్మహత్య కేసును కొలిక్కి తీసుకొచ్చేం దుకు పోలీసులకు కీలకమైన ఆధారాలు లభించాయి. ఎస్సై గోపాల్ బదానే తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆమె ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు మరికొన్ని ఆధారాలు దొరికాయి. డాక్టర్ ఆత్మహత్యకు కారణమని భావిస్తున్న ప్రశాంత్ బంకర్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో ఆమె ఎప్పటి కప్పుడు మెసేజ్‌లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ సూసైడ్ చేసుకోవడానికి ముందు మానసికంగా చాలా కుంగిపోయి చనిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ ఇంట్లో మహిళా డాక్టర్ పూజకు హాజరయ్యిందని.. కానీ అక్కడ గొడవ జరిగిన తర్వాత ఆమె అక్కడినుంచి వెళ్లి హోటల్‌లో చేరి, తీవ్ర మనోవేదనతో ఉరి వేసుకొని చనిపోయిందని తెలిపారు. సతారా పోలీసు విభాగానికి చెందిన ఎస్సై గోపాల్ బదానే పలుమార్లు తనపై లైంగిక దాడి చేశాడని ఇప్పటికే ఆమె సూసైడ్ నోట్ లో తెలిపింది. మరో వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధింపులకు గురిచేశాడని ఆమె ఆరోపించింది. దర్యాప్తులో భాగంగా పోలీసులు వీరిద్దరినీ అరెస్ట్ చేయగా.. కేసు విచారణ కొనసాగుతుంది. మహారాష్ట్ర మహిళా సంఘం చైర్‌పర్సన్ రూపాలి చకాంకర్ మాట్లాడుతూ.. బంకర్ ఇంట్లో వైద్యురాలు లక్ష్మీ పూజకు హాజరై, అక్కడ ఫోటోలు తీసుకునే విషయంలో గొడవలు జరిగాయని తెలిపారు. తర్వాత డాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయిందని.. బంకర్ తండ్రి ఆమెను తిరిగి తీసుకురాగానే, ఆమె మరోసారి హోటల్‌కు వెళ్లిపోయిందని చెప్పారు.



## మరింత తగ్గిన బంగారం ధర..

### రూ.1.50 లక్షల దిగువకు వెండి

**హైదరాబాద్:** దీపావళి సమయంలో ఉవ్వెత్తున ఎగసిన పసిడి ధర దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టు బడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాలతో దిద్దుబాటుకు గురైంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4 వేల డాలర్ల స్థాయి దిగువకు చేరింది. అమెరికా- చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ కరెక్షన్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో పుత్తడికి డిమాండ్ తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో మధ్యాహ్నం 12.30 గంటల సమయానికి 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర రూ.1.22 లక్షలు పలుకుతోంది. ఒక్క రోజులో దాదాపు రూ.2 వేల మేర తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.12 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు 3947 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అటు వెండి సైతం తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ సిల్వర్ ధర 46.59 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1.48 లక్షల వద్ద కొనసాగుతోంది.

## ఢిల్లీ విమానాశ్రయంలో తప్పిన ముప్పు

### ఎయిరిండియా బస్సుకు అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 :** దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా బస్సు దగ్ధమైంది. విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన జరిగినప్పటికీ ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రౌండ్ హ్యాండిలర్స్‌కు చెందిన బస్సు మధ్యాహ్నం స మయంలో మంటల్లో చిక్కుకుందని, అయితే ఏఆర్ఎఫ్ఎఫ్ నిపుణుల బృందం రెండు నిమిషాల్లోనే మంటలను అదుపు చేసిందని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో తెలియజేసింది. ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ నష్టం జరగలేదని తెలిపింది. విమాన సర్వీసులు యథాప్రకారం నడుస్తున్నాయని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది.



## కృత్రిమ వర్షానికి దిల్లీ రెడీ..

### క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ పూర్తి

**దిల్లీ :** దేశ రాజధాని దిల్లీని తీవ్ర వాయు కాలుష్యం వేధిస్తోంది. దీపావళి అనంతరం పరిస్థితులు మరింత దిగజారాయి. మంగళవారం దిల్లీలో వాయు నాణ్యత సూచీ 306గా నమోదు అయినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. ఇది తీవ్రమైన కాలుష్య కేటగిరిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు స్థానికంగా కృత్రిమ వర్షం కురిపించేందుకు దిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా 'క్లౌడ్ సీడింగ్' ప్రక్రియను పూర్తి చేసింది. ఐఐటీ కాన్పూర్ నుంచి బయల్దేరిన ఎయిర్ క్రాఫ్ట్ సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను వివిధ ప్రాంతాల్లోని మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో మరికొన్ని గంటల్లో వర్షం పడే అవకాశం ఉంది. నగరంలో ఐదు క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించడానికి దిల్లీ ప్రభుత్వం సెప్టెంబర్ 25న ఐఐటీ కాన్పూర్‌తో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం.. అక్టోబర్ 1 నవంబర్ 30 మధ్య ఎప్పుడైనా ట్రయల్స్ నిర్వహించడానికి పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను నిర్వహించడానికి కావాల్సిన రూ.3.21 కోట్ల బడ్జెట్‌ను దిల్లీ మంత్రివర్గం మేలో ఆమోదించింది. అయితే, ప్రతికూల వాతావరణం, రుతుపవన పరిస్థితుల కారణంగా ఈ ప్రక్రియ పలుమార్లు వాయిదా పడింది.

### కృత్రిమ వర్షాలు ఎలా కురిపిస్తారు?

తొలుత శాస్త్రవేత్తలు కృత్రిమ వర్షానికి అనువైన మేఘాలను గుర్తిస్తారు. వాటిలో సరిపడా తేమ ఉంటుంది. కానీ, వర్షించేందుకు అనువైన పరిస్థితులు ఉండవు. అలాంటి సందర్భంలో.. సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను మేఘాలపై చల్లి.. క్లౌడ్ సీడింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఇవి మేఘాల్లోని తేమను కరిగించి.. వర్షపు బిందువుల రూపంలో కింద పడేందుకు సహకరిస్తాయి. కొన్ని సార్లు పొడి మంచును కూడా వినియోగిస్తారు. దీనివల్ల మేఘాలు చల్లబడి వర్షం కురిసేందుకు వీలుంటుంది.

## కేంద్ర ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

### 8వ వేతన కమిషన్‌కు ఆమోదం



**దిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. కోటీ పదిహేను లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పింఛనుదారుల.. జీతాలు, పింఛన్లు పెంచేందుకు వీలుగా 8వ వేతన కమిషన్‌కు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజన దేశాయ్ ఈ పే కమిషన్‌కు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ప్రస్తుత 7వ వేతన సవరణ సంఘం కాలపరిమితి 2026తో ముగుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ తర్వాత కొత్త వేతన సవరణ అమలు చేయడానికి వీలుగా 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై పలువురు కేంద్ర మంత్రులు, మంత్రిత్వ విభాగాల సిబ్బందితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరిపింది. అనంతరం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌లో ఛైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులు ఉండనున్నారు. ఈ సంఘం 18 నెలల్లో సిఫార్సులు ఇవ్వనుందని కేంద్రం ఓ ప్రకటనలో వెల్లడించింది.

### వేతన సంఘం అంటే..

దేశంలో సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పింఛనుదారుల వేతనాలు, భత్యాలు ఎంత ఉండాలో నిర్ణయించడంలో వేతన సంఘం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతమున్న జీతాలు, పింఛన్లను ఎంత మేర పెంచాలో ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం వేతన సవరణ చేపడుతుంది.



## బిహార్ ఎన్నికల వేళ..

### ఇద్దరు ఎమ్మెల్యేలతో సహా 27 మంది నాయకులపై ఆర్జేడీ వేటు

**బిహార్ :** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిహార్‌లో రాజకీయం వేడెక్కింది. ఈ క్రమంలో ప్రతిపక్ష ఆర్జేడీ కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో ఇద్దరు ఎమ్మెల్యేలతో సహా 27 మంది నాయకులపై వేటు వేసింది. పార్టీ చీఫ్ మంగని లాల్ మండల్ ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. బహిష్కరణకు గురైన నాయకులను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మహాగట్‌బంధన్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ తెలిపింది. బహిష్కరణకు గురైన 27 మందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు చోటేలాల్‌రాయ్, మహ్మద్ కమ్రాన్‌తో పాటు నలుగురు మాజీ ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ ఉన్నారు. దీనికి ముందు భాజపా కూడా ఇలాంటి చర్యలే చేపట్టింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే కారణంతో ఆరుగురు నేతలపై బహిష్కరణ వేటు వేసింది. ఎన్డీయే అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. భాజపా బహిష్కరించిన వారిలో ప్రస్తుత ఎమ్మెల్యే పవన్‌యాదవ్ కూడా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నుంచి టికెట్ రాకపోవడంతో ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాష్ట్రంలో వచ్చేనెల 6, 11వ తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబరు 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.



## మరో రోజు దిశ సమావేశం నిర్వహణ

### ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** దిశ సమావేశం మరో రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ,పరిశ్రమలు, పౌర సరఫరాల శాఖపై గత దిశ సమావేశం లో తీసుకున్న నిర్ణయాల అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో రోజు దిశ సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### ఉదయం 11 గంటలైనా

## తెరుచుకుని పల్లె దవాఖాన

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పరిధిలోని దారూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామపంచాయతీ పరిధిలోని పల్లె దావకాన మంగళవారం ఉదయం 11 గంటలైనా తెచ్చుకోలేని స్థితి నెలకొన్నదని స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధరూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామానికి చెందిన పల్లె దావకానలో సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో వైద్యం అందే విధంగా ఉండాలని పేర్కొన్నారు. కురుస్తున్న వర్షాలకు కారణంగా గ్రామాలలోని ప్రజలు అనారోగ్యాలకు గురి అయ్యే అవకాశం ఉన్నందున పల్లె దవఖానలో వైద్యం అందించేందుకు ఎవరో ఒక సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లె దావకానాకు వైద్య సిబ్బంది సమయానుకూలంగా వచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.



## టిఆర్పీలో చేరిన పెన్‌పహాడ్ మాజీ జడ్పిటిసి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లాలో బిఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. పెన్ పహాడ్ మాజీ జడ్పిటిసి మామిడి అనిత అంజయ్య మంగళవారం హైదరాబాదులో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవుల ఆధ్వర్యంలో టిఆర్పీ లో చేరారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి అంజయ్య మాట్లాడుతూ సమాజంలో సింహాభాగం ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలతోనే రాజ్యాధికారమే లక్ష్యంగా స్థాపించిన టిఆర్పీ బహుజన వాదంతో దూసుకెళ్తుందని తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు దక్కకుండా అడ్డుకుంటున్న అగ్రకుల పార్టీలకు ఇక చెమటలు పట్టడం ఖాయమన్నారు. అగ్రవర్ణ పార్టీలకు బహుజనులు ఊడిగం చేయటం ఎన్నాళ్లు ఎన్నికల్లో యంత్రాల్లా వాడుకుంటున్న అగ్రకులాల వారి ఆటలు ఇక సాగవు సాగనియ్యం. అని తెలిపారు. రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం దిశగా టిఆర్పి ఆధ్వర్యంలో బహుజన కులాల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో ముందుకెళ్తాం. అన్నారు. బహుజనులకు సరైన వేదిక,జన గొంతుక,టిఆర్పి పార్టీ ఏడు దశాబ్దలుగా బీసీలను అణగదొక్కుతున్న అగ్రకులాలకు చెక్ పెట్టేలా టిఆర్పీని విస్తరిద్దాం, బలోపేతం చేద్దాం, బహుజనుల సుదీర్ఘ కోరిక నెరవేరేలా గొంతు ఎత్తుదాం అని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మీర్ అక్బర్,ఆవుల అంజయ్య యాదవ్,మాజీ ఎంపిటిసి ఉప్పల మల్లయ్య,యాదవ్. బొల్లె సైదులు, వెంకటేష్,మామిడి ఉదయ్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.



## త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలి

### మంచినీటి కోసం కాలి బిందెలతో రోడ్డెక్కిన జనం

**వాజేడు, రాజముద్ర న్యూస్:**మండల కేంద్రంలో గత 20 రోజులనుండి తాగునీటీ సరఫరా నిలిచిపోయిందని, రోడ్డెక్కిన జనం, బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏంపిడిఓ కార్యాలయం ఎదుట కాలి బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని,స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..మరమ్మత్తులను వెంటనే చేయించి 24 గంటల్లోపు మంచి నీటి సమస్యలను తీర్చాలని,లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు స్పందిస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటామని,ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచి నీరు అందించేలా ప్రయత్నం చేస్తామని చెప్పటంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ ముడిగతిరుపతి యాదవ్ , సిరుమర్తి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ కల్లూరు సతీష్, వెంకట్ రెడ్డి, మీనయ్య ,సాయి, ఎట్టి పాపారావు,మహిళలు జంపాల దేవి, తంగిళ్ళపల్లి ,రమాదేవి శారద ,అనసూర్య, వెంకట నర్సు,తదితరులు పాల్గొన్నారు.

### నేలకొండపల్లిలో ఘనంగా

## మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

### వేడుకల్లో పాల్గొన్న క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి





**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండల కేంద్రం లో రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో భారీ బైక్ ర్యాలీ చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ పంపిణీ చేశారు. అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. పాలేరు ప్రజల పెద్ద కొడుకుగా ఉండి వారి కష్టాలను తీరుస్తున్నారని ఆయన తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలను తీరుస్తున్న గొప్ప నాయకుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొడాలి గోవిందరావు, నాయకులు కుక్కల హనుమంతరావు,నెల్లూరి భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, మామిడి వెంకన్న,జెర్రిపోతుల సత్యనారాయణ,బొడ్డు బొందయ్య, వంగవీటి నాగేశ్వరరావు, నంబూరి రామారావు,మైసా శంకర్, గుండా బ్రహ్మం, జెర్రిపోతుల అంజని, యడవల్లి నాగరాజు, కట్టెకోల నాగార్జున, వాకా శ్రీనాద్, చిట్టెంచెట్టి వెంకటేష్, ఎర్ర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### అవినీతి రహితంగా పారదర్శకంగా

## ప్రజలకు సేవలు అందించాలి

- ఉద్యోగులు సర్వీసులో కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పని చేయాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** 2025 లో భాగంగా డైరెక్టర్ జనరల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శిఖగోయల్ ఐపీఎస్ ఆదేశానుసారం హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్ట్రరేట్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిజాయితీగా ఉండాలని ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ఎటువంటి లోపం లేకుండా బాధ్యతతో అవినీతి రహితంగా, పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు విజిలెన్సు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విజిలెన్సు అందరి బాధ్యత అనేది ఉద్యోగులు గుర్తించాలి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా సర్వీస్ లో చేరినప్పుడు కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పని చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి శాఖ ఉద్యోగి తన పరిధిలో చేయాల్సిన సేవలు అందించాలని అన్నారు. ప్రజలకు సేవలు పొందే హక్కు ఉందని ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అవినీతి లేకుండా ఎటువంటి ప్రతి ఫలం ఆశించకుండా సుపరిపాలన అందించాలని అన్నారు. జిల్లా కేంద్రం నుండి గ్రామం వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మంచి సేవలు అందించాలని సూచించారు. ప్రతి సంవత్సరం విజిలెన్స్ వారోత్సవాలు జరపాలని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ యొక్క ఉద్దేశాలను ప్రతి మండలంలో ప్రతి గ్రామంలోని పౌరులకు చేరే విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులు కలెక్టరేట్ సిబ్బందితో విధి నిర్వహణలో నిజాయితీ తో కూడిన సేవలను అందించడం, పారదర్శకతను పాటించడం బాధ్యతయుతంగా వ్యవహరించ డం ప్రభుత్వ సహాయం కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ న్యాయ సూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టు బడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యా నాయక్, (లోకల్ బాడీస్) అదనపు కలెక్టర్ సుదీర్, ఆర్ డి ఓ మంగీ లాల్ , విజిలెన్స్ అధికారులు రఘు రామ్ , శ్రీనివాస్ రావు ,వెంకట్ రెడ్డి , కలెక్టరేట్ ఏ ఓ పర్వీన బేగం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### విద్యార్థినుల భద్రతకు

## భంగం కలిగిస్తే సహించం

### మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద



**కరీంనగర్, అక్టోబర్ 28:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ చేసిన అనుచిత ప్రవర్తనపై తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ నేరెళ్ల శారద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో చదువుకునే బాలికల భద్రత, గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని ఏ విధంగానూ సహించబోమని ఆమె స్పష్టం చేశారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థలు బాలికల భవిష్యత్తు నిర్మాణానికి బాటలు వేయాలని, అవి స్వేచ్ఛాయుతం, సుర క్షితం మరియు గౌరవప్రద వాతావరణంగా ఉండాలనే బాధ్యత అందరిపైనా ఉందని నేరెళ్ల శారద అన్నారు. విద్యార్థినులపై ఎలాంటి వేధింపులు, అనుచిత ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ కేసు పురోగతిని మహిళా కమిషన్ స్వయంగా పర్యవేక్షిస్తుందని, బాధిత విద్యార్థినులకు అన్ని విధాల సహకారం అందిస్తామని చైర్పర్సన్ హామీ ఇచ్చారు.



### ఘనంగా మంత్రి పొంగులేటి

## జన్మదిన వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ రఘురాం రెడ్డి
- స్వగ్రామం చేగొమ్మ గ్రామంలో పర్యటన

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నమ్ముకున్న అభిమానులకి ఏ కష్టం వచ్చిన అండగా నిలబడే నిబద్ధత కలిగిన నాయకుడు మంత్రి పొంగులేటి అని తెలిపారు. పార్టీలకి,కులమతాలకు అతీతంగా ప్రజా సేవ చేస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. అనంతరం స్వగ్రామమైన చేగొమ్మకు వెళ్లి గ్రామ పెద్దలు,వృద్ధులను పలకరించి.. ఊరి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. సొంతూరి పర్యటనకు వచ్చిన ఎంపీకి గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. తొలుత కాంగ్రెస్ నాయకులు బొలికొండ వెంకన్న ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి వెంకన్న చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుమారుడు శ్రీనును పరామర్శించి ఓదార్చారు.

### ప్రభుత్వ పాఠశాలకు ఇచ్చిన తమ భవనం పరిశీలన

చేగొమ్మలో దశాబ్దాల కిందట ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్వగృహాన్ని ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పరిశీలించారు. తరగతి గదులను, నిరుపయోగంగా ఉన్న పై అంతస్తును పరిశీలించి,అవసరమైన మరమ్మతులు చేయిస్తానని అభయమిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషన్ రావు, బేబీ స్వర్ణకుమారి, భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి,కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మోదుగు వీరభద్రం,హఫీజుద్దీన్,మంకెన వాసు,జొన్నలగడ్డ రవి, రామ్ కుమార్, లెనిన్,కొండపర్తి సురేష్,గ్రామ పెద్దలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెడ్ మాస్టర్ నిర్లక్ష్యంతోనే దారుణం!

- కురిక్యాల పాఠశాలలో విద్యార్థినులపై అఘాయిత్యం
- తల్లిదండ్రుల ఆవేదన
- యాకూబ్ పాషా లైంగిక వేధింపుల కేసులో సంచలన అంశాలు వెలుగు

**కరీంనగర్, అక్టోబర్ 28:**గంగాధర మండలం కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ యాకూబ్ పాషా లైంగిక వేధింపుల కేసు మరింత సంచలనం రేపుతోంది. ఈ ఘటనలో పాఠశాల హెడ్ మాస్టర్ కమల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విద్యార్థినులు తమపై యాకూబ్ పాషా అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని గతంలోనే హెడ్ మాస్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తల్లిదండ్రులు తెలిపారు. “ఈ విషయాన్ని బయటపెడితే టీసీ ఇచ్చి పంపేస్తాను… మీ భవిష్యత్ గురించి ఆలోచించుకోండి” అంటూ బెదిరించిందని ఆరోపించారు. టీసీ భయం, భవిష్యత్ ఆందోళనతో ఇన్నాళ్లు మౌనంగా ఉన్న తమ పిల్లలు ఇప్పుడు ఒక్కొక్కరుగా నిజాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెడ్ మాస్టర్ అండదండలతోనే యాకూబ్ పాషా ఇంత దారుణాలకు తెగబడాడని వారు మండిపడ్డారు. “మీరు ముందే చర్యలు తీసుకుని ఉంటే ఇంత దారుణం జరిగేది కాదు కదా?” అంటూ ప్రశ్నించారు. విద్యార్థినుల పట్ల తప్పుడు ప్రచా రం చేసి మానసికంగా వేధించిందని కూడా విమర్శించారు. “మా పిల్లలు మీ పిల్లలకన్నా తక్కువా?” అంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు కూడా అటెండర్ తరచుగా తమతో అనవసరంగా మాట్లాడడం, బాత్రూంల వైపు వెళ్తున్నప్పుడు మొబైల్‌లో ఫొటోలు తీయడం, రహస్యంగా కెమెరాలు అమర్చడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ వివరాలు బయటకు రావడంతో ప్రాంతంలో తీవ్ర కలకం నెలకొంది. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరి స్తోంది. ఇప్పటికే హెడ్ మాస్టర్ కమల, అటెండర్ యాకూబ్ పాషాలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నిందితుడు యాకూబ్ పాషాను పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో

# నెలవారి సమీక్ష సమావేశం

- వాహనాలపై నిలబడి ప్రయాణం చేయడం ప్రమాదం
- సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలి
- కె.నరసింహ, ఐపిఎస్,ఎస్పి సూర్యాపేట జిల్లా

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు జిల్లా ఎస్పీ గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు పిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేసుకోవాలన్నారు ,రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలి, కేసులు పెండింగ్ లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలి, కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలి,పోక్సో కేసుల్లో, మహిళా సంభంద కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పని చేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలని పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా పని చేయాలని, పోలీసు వేగవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పని చేయాలని ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ వాహన దారులను ప్రజలను రోడ్డు భద్రత పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను,వ్యాపారులను ప్రోత్సహించాలి అని తెలియజేశారు. ప్రయాణ సమయంలో ప్రజలు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనాలపై నిలబడి ప్రయాణం,ఎక్కువ మంది ప్రయాణం చేయడం ప్రమాదమని గుర్తు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అక్రమ రవాణాలకు పాల్పడితే అలాంటి వారిని ఉపేక్షించమని హెచ్చరించారు. పని విభాగాల నిర్వహణలో అధికారులకు రివార్డ్స్ అందించిన జిల్లా ఎస్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ పని విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ గత నెలలో కేసుల దర్యాప్తు,ఇన్వెస్టిగేషన్ లో బాగా పని చేసిన కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ ను, సూర్యాపేట టూ టౌన్ ఎస్సై శివతేజను,అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్ లను ఎస్పి అభినందించి రివార్డ్ అనించారు. ఈ సమావేశం నందు జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్,డిసిఆర్బి డిఎస్పి రవి,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరిబాబు,ఇన్స్పెక్టర్లు శివశంకర్, ప్రతాప్ లింగం,రామకృష్ణా రెడ్డి, చరమందరాజు,నాగేశ్వరరావు, నరసింహారావు,రాజశేఖర్, వెంకటయ్య, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ,ఎస్ఐలు,ఐటి కోర్ సిబ్బంది,డిసిఆర్బి సిబ్బంది ఉన్నారు.








## గాజాకు పాక్ సైనికులు

**గాజా :** ఇజ్రాయెల్– హమాస్‌ల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో శాంతి ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గాజాలో పాకిస్థాన్ తన దళాలను మోహరించేందుకు సిద్ధమైంది. శాంతి ఒప్పందంలోని అంతర్జాతీయ దళాలలో భాగంగా పలు దేశాలు తమ బలగాలను పంపనున్నాయి. ఇటీవల పాక్ ఆర్మీచీఫ్ జనరల్ ఆసిం మునీర్, ఇజ్రాయెల్‌కు చెందిన మొసాద్, యూఎస్‌కు చెందిన సీఐఏ సీనియర్ అధికారుల మధ్య రహస్య సమావేశాలు జరిగాయి. ఈ క్రమంలో పాక్ సైనికుల మోహరింపునకు సంబంధించిన ఓ నిర్ణయం వెలువడినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా దాదాపు 20వేల మంది సైనికులను పాక్ అక్కడకు పంపనుంది. దీనికి సంబంధించి ఇస్లామాబాద్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. పాక్ దళాలు గాజాలో అంతర్గత భద్రతను కట్టుదిట్టం చేయడం, మానవతా సాయం, పునర్నిర్మాణానికి సంబంధించిన సేవలు అందిస్తాయి. దీంతో పాటు హమాస్‌ను ఆయుధరహితంగా మార్చడంతో సహా సరిహద్దుల్లో భద్రత బాధ్యతలు చేపడుతాయి. పాక్ దళాలు.. ఇజ్రాయెల్, గాజాలోని మిగిలిన మిలిటెంట్ వర్గాల మధ్య బఫర్ ఫోర్స్‌గా పనిచేస్తాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మోహరింపునకు ప్రతిగా.. ఇజ్రాయెల్, అమెరికాల నుంచి పాక్‌కు ఆర్థిక ప్రోత్సాహకాలకు సంబంధించిన హామీలు లభించినట్లు తెలుస్తోంది. పాక్ దళాల ప్రమేయం సున్నితమైనదని, కానీ వ్యూహాత్మకంగా ప్రయోజనం చేకూరేదని ఇజ్రాయెల్ మీడియా అభివర్ణించింది. ఐక్యరాజ్యసమితి శాంతి కార్యకలాపాలకు ఎక్కువగా దళాలను అందించే దేశాల్లో పాక్ ఒకటి. ఆఫ్రికా, ఆసియా అంతటా ఐరాస కార్యకలాపాలకు 2లక్షల కంటే ఎక్కువ మంది దళాలను ఇప్పటికే మోహరించింది.



## దుబాయ్‌లో ఎన్ఆర్ఐల కోసం..
## పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్

**దుబాయ్ :** ఎన్ఆర్ఐల కోసం దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్.. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0ను ఆవిష్కరించింది. ఆధునికీకరించిన ఈ ప్రోగ్రామ్ మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. పాస్‌పోర్టు సేవలను రిజిస్టర్ చేసుకోవడానికి, దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తుదారులు కొత్తగా లాంచ్ అయిన ఆన్‌లైన్ పోర్టల్‌ను వినియోగించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ప్రాసెస్, సర్వీస్ సెంటర్లలో ఎదురుచూపులు తగ్గించేందుకు ఈ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ 2.0 కింద ఈ–పాస్‌పోర్టులను తీసుకువచ్చారు. ఈ సాంకేతికతతో ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌లు వేగవంతం కానున్నాయి. భారత్ అందించే సేవలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మారనున్నాయి. వీసా అవసరాలకు తగ్గట్టుగా ఫొటో, సంతకం, ఇతర పత్రాలను నేరుగా ఆ పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సెంటర్లలో ప్రాసెసింగ్ టైమ్ తగ్గే అవకాశం ఉంటుంది. యూఏఈలో ఉన్న ప్రవాస భారతీయుల కోసం ఈ ప్రోగ్రామ్ ఆధునికీకరణ చేపట్టినట్లు కాన్సులేట్ వెల్లడించింది. ఈ సరికొత్త సేవలు పొందేందుకు యూజర్లు ఈ పోర్టల్‌లో రిజిస్టర్ అయి, లాగిన్ కావాల్సి ఉంటుంది. కొత్త అప్లికేషన్‌ను జనరేట్ చేసి, ఫార్మ్‌ను ప్రింట్ తీసుకోవాలి. తర్వాత బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ ద్వారా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవాలి.



## ట్రంప్‌ను నోబెల్‌కు నామినేట్ చేస్తా : జపాన్ ప్రధాని

**జపాన్ :** నోబెల్ శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నో ఆశలు పెట్టుకొన్న సంగతి తెలిసిందే. పలు దేశాల మధ్య యుద్ధాలు ఆపానని ప్రచారం చేసుకుంటున్న ట్రంప్.. వచ్చే ఏడాది ఆ పురస్కారం కోసం ప్రయత్నించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నోబెల్ శాంతి బహుమతికి అధ్యక్షుడిని నామినేట్ చేస్తానని జపాన్ ప్రధాని సనాయె తకాయిచి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్ వెల్లడించింది. "థాయ్‌లాండ్–కంబోడియాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదర్చడంలో ట్రంప్ విజయం సాధించారు. ఇక, పశ్చిమాసియాలో కుదిర్చిన ఒప్పందం (ఇజ్రాయెల్–హమాస్) చరిత్రాత్మకమైంది" అని జపాన్ ప్రధాని పేర్కొన్నారు. జపాన్ రాజధాని టోక్యోలో ఈ ఇద్దరు నేతల మధ్య భేటీ జరిగింది. ఆ సందర్భంగా నోబెల్ ప్రస్తావన వచ్చింది. ట్రంప్ మాట్లాడుతూ.. "నాకు జపాన్ అంటే అభిమానం, గౌరవం ఉన్నాయి. ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడనుంది. ఈ దేశానికి ఎప్పుడూ అండగా ఉంటాం" అని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరీనా మచాదోను వరించిన సంగతి తెలిసిందే. ట్రంప్ నకు నోబెల్ రాకపోవడంపై వైట్‌హౌస్ ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. గాజా కాల్పుల విరమణ తర్వాత కూడా ట్రంప్ సేవలకు తగినంత గౌరవం దక్కలేదని పేర్కొంది. ఈ క్రమంలో నోబెల్ కమిటీ శాంతి కంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చిందని ఆరోపించింది.

# భారత్‌లో విమానాల తయారీ

## హెచ్ఏఎల్‌తో రష్యా సంస్థ ఒప్పందం




**న్యూఢిల్లీ :** విమానాల విడిభాగాలు, హెలికాప్టర్ల తయారీలో ఎంతో పురోగతి సాధిస్తోన్న భారత్.. పూర్తి స్థాయి ప్రయాణికుల విమానాల ఉత్పత్తి వైపు అడుగులు వేస్తోంది. దేశంలో ఎస్‌జే–100 జెట్‌లను తయారు చేసేందుకు రష్యా యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ సిద్ధమైంది. ఈ మేరకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌తో యూఏసీ ఒప్పందం చేసుకుంది. "భారత్‌లో పూర్తి ప్రయాణికుల విమానం తయారు చేయనుండడం ఇదే తొలిసారి. గతంలో ఏవీఆర్ఓ హెచ్ఎస్–748 విమానాలను 1961లో తయారు చేయగా.. 1988లో ఆ ప్రాజెక్టు ముగిసింది. రానున్న పదేళ్లలో స్థానిక కనెక్టివిటీ కోసం ఎస్‌జే–100 వంటి చిన్న పరిమాణం కలిగిన 200 విమానాలు అవసరం. పౌర విమానయాన రంగంలో భారత్ ఆత్మనిర్భరత సాధించేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది" అని హెచ్ఏఎల్ ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశంలో ఉడాన్ పథకం కింద స్వల్ప దూర ప్రయాణాలకు గేమ్ ఛేంజర్‌గా మారనుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఎస్‌జే–100 రెండు ఇంజిన్లతో కూడిన చిన్న పరిమాణం కలిగిన విమానం. 103 మంది ప్రయాణికుల సామర్థ్యం ఉన్న ఈ విమానం.. స్వల్ప దూరం ప్యాసింజర్ సేవలకు అనువుగా ఉంటుంది. నిర్వహణ ఖర్చు కూడా తక్కువే. తాజా ఒప్పందంతో దేశీయ అవసరాలకు అనుగుణంగా ప్రయాణికుల విమానం తయారు చేసేందుకు హెచ్ఏఎల్‌కు వీలు ఉంటుంది. ఇప్పటికే రష్యా సంస్థ 200 విమానాలను తయారు చేయగా.. ప్రపంచవ్యాప్తంగా 16 ఎయిర్‌లైన్ సంస్థలు వీటిని నడిపిస్తున్నట్లు తెలిసింది.

# అమెరికా యుద్ధ నౌక లక్ష్యంగా సీఐఏ కుట్ర

## తిప్పికొట్టామన్న వెనుజువెలా



**వెనుజువెలా :** ఇటీవల కాలంలో కరీబియన్ సముద్ర జలాల్లో డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలు, జలాంతర్గాములపై అగ్రరాజ్యం దాడులు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో అమెరికా యుద్ధ నౌకపై దాడి చేసి.. ఆ నేరం తమ పైకి నెట్టేయాలని అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కుట్ర పన్నుతున్నట్లు వెనుజువెలా మినిస్టర్ ఆరోపించారు. ఇందులోభాగంగా తమ దేశానికి చెందిన యూఎస్ఎస్ గ్రేవ్లీ అనే గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్‌పై దాడి చేసి.. తమపై నేరం మోపాలని సీఐఏ పన్నాగం పన్నిందన్నారు. అయితే తమ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి దానిని భగ్నం చేశారని తెలిపారు. దాడికి ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. కరీబియన్ సముద్ర జలాల్లో యుద్ధాన్ని ప్రేరేపించే లక్ష్యంతో అగ్రరాజ్యం ఈ కుట్ర పన్నినట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద వాహక నౌక 'యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'ను వెనెజువెలా సమీపానికి తీసుకెళ్లడం ద్వారా అమెరికా ఆ దేశంపై ఒత్తిడి తీవ్రతరం చేస్తోంది. ఈ పరిణామాలను వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో ఇటీవల తీవ్రంగా ఖండించారు. అమెరికా ప్రభుత్వం తనపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. "ట్రంప్ యంత్రాంగం కొత్త, శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది. మాదకద్రవ్యాల విషయంలో అతిశయోక్తులతో కూడిన, అసభ్యకరమైన, నేరపూరితమైన, తప్పుడు కథనాలను అల్లుతోంది. మా దేశం కొకైన్‌ను ఉత్పత్తి చేయదు" అని మదురో జాతీయ మీడియాలో ప్రసంగించారు. అనంతరం వెనుజువెలా మినిస్టర్ తాజా ఆరోపణలు చేయడం గమనార్హం. వెనెజువెలాకు చెందిన వ్యవస్థీకృత నేరాల ముఠా 'ట్రెన్ డి అరాగ్వా'కు మదురో నాయకుడని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. ఆయన ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు.

# అమెరికాకు షాకిచ్చిన పుతిన్..

## మొదలైన అణు టెన్షన్..



**రష్యా :** ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యవహరిస్తోన్న తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ అమెరికాకు పుతిన్ గట్టి షాకిచ్చారు. అగ్రరాజ్యంతో ఉన్న ప్లుటోనియం ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన చట్టంపై పుతిన్ తాజాగా సంతకం చేశారు. దీంతో మళ్లీ అణు టెన్షన్ మొదలైనట్లయ్యింది. అమెరికా, రష్యాల మధ్య 2000 సంవత్సరంలో ది ప్లుటోనియం మేనేజ్‌మెంట్ అండ్ డిస్‌పొజిషన్ అగ్రిమెంట్ కుదిరింది. 2010లో దీన్ని సవరించారు. ఈ ఒప్పందం ప్రకారం.. ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత తమ వద్ద నిల్వ ఉన్న 34 మెట్రిక్ టన్నుల ప్లుటోనియంను అణ్వాయుధాల తయారీకి కాకుండా.. పౌర అణు విద్యుత్ కోసం వినియోగించేలా నిర్ణయించారు. ఈ ఒప్పందంతో దాదాపు 17 వేల అణ్వాయుధాల తయారుకాకుండా అడ్డుకున్నట్లు అవుతుందని అప్పట్లో అమెరికా అధికారులు అంచనా వేశారు. అయితే, 2016లో నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా సమయంలో అగ్రరాజ్యంతో రష్యా సంబంధాలు దెబ్బతిన్నాయి. దీంతో ఈ ఒప్పందం అమలును పుతిన్ నిలిపివేశారు. తాజాగా ఈ అగ్రిమెంట్‌ను పూర్తిగా రద్దు చేసుకుంటూ చట్టంపై సంతకం చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం వేళ.. ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. దీంతో రష్యా మళ్లీ అణ్వాయుధ తయారీని వేగవంతం చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

### మాతో ఆటలొద్దు : ట్రంప్

ఇదిలా ఉండగా.. ఇటీవల రష్యా అణుశక్తితో నడిచే 'బురెవెస్ట్‌నిక్' క్రూజ్ క్షిపణిని పరీక్షించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ తాజాగా స్పందిస్తూ పుతిన్ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్షిపణి ప్రయోగం తగదని, యుద్ధాన్ని ముగించడంపై రష్యా దృష్టిపెట్టాలన్నారు. "ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మా అణు జలాంతర్గాములు రష్యా తీరానికి దగ్గర్లోనే ఉన్నాయని వాళ్లకు తెలుసు. మాతో ఆటలాడొద్దు. మేం కూడా ఎవరితోనూ గొడవలు పెట్టుకోవాలనుకోవట్లేదు. ఒక్క వారంలో ముగించాల్సిన యుద్ధాన్ని పుతిన్ తన చర్యలతో నాలుగో సంవత్సరానికి తీసుకొస్తున్నారు. ఇప్పటికైనా క్షిపణి పరీక్షలు ఆపి.. యుద్ధం ముగించడంపై దృష్టిపెట్టాలి" అని ట్రంప్ సూచించారు. ఈ 'బురెవెస్ట్‌నిక్' క్రూజ్ క్షిపణి.. పరీక్షల సమయంలో 15 గంటల పాటు గాల్లోనే ఉందని, 14వేల కిలోమీటర్లు ప్రయాణించింది. అత్యంత కచ్చితత్వంతో ఎంత దూరంలో ఉన్న లక్ష్యాన్నైనా ఛేదించగల సామర్థ్యం దీని సొంతమని రష్యా సైన్యంలోని చీఫ్ ఆఫ్ స్టాఫ్ వాలెరీ గెరాసిమోవ్ పేర్కొన్నారు. దీని మోహరింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సైనికాధికారులను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశించారు.

# భారత్ విషయంలో పెద్ద తప్పు చేస్తున్నారు

## ట్రంప్ యంత్రాంగంపై విమర్శలు



**యూఎస్ :** భారత్ విషయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద తప్పు చేస్తున్నారని అమెరికా వాణిజ్యశాఖ మాజీ మంత్రి జినా రెమాండో విమర్శించారు. ట్రంప్ ప్రభుత్వ పాలసీలు మిత్ర దేశాలను దూరం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన విధానాలు భారత్‌తో సంబంధాలను ధ్వంసం చేస్తున్నాయని హెచ్చరించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం కెన్నడీ స్కూల్స్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్‌లో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. "అమెరికాకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్తున్నారు. కానీ అమెరికా ప్రభావాన్ని ప్రపంచవ్యాప్తంగా బలహీనపరుస్తూ ఏకాకిని చేయడం మాత్రం వినాశకరమైంది. ప్రస్తుత విధానాలు కీలకమైన ఆర్థిక, వ్యూహాత్మక భాగస్వామ్యాలను దెబ్బతీస్తోంది. ఐరోపా, జపాన్‌కు మిత్ర దేశంగా లేని అమెరికా.. బలహీనంగా మారుతుంది. ఐరోపా, ఆగ్నేయాసియాతో బలమైన సంబంధాలు లేకుండా మనం ప్రభావవంతంగా ఉండగలమని నేను అనుకోవడం లేదు. ఐరోపాతో బలమైన వాణిజ్య సంబంధాలు కలిగిఉండాలని కోరుకుంటున్నాను. అలాగే భారత్ విషయంలో పెద్ద తప్పు చేస్తున్నామని నా అభిప్రాయం" అని రెమాండో వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ యంత్రాంగం భాగస్వాములతో అహంకారం తో వ్యవహరిస్తోందని ఆరోపించారు. వాషింగ్టన్ తన సంబం ధాలను చక్కదిద్దుకునేవరకు మిగతా ప్రపంచం వేచిచూడదని హెచ్చరించారు. ఐరోపా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆగ్నేయా సియాలో చైనా తన ప్రభావాన్ని విస్తరించుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్ ఎగుమతులపై ట్రంప్ యంత్రాంగం 50 శాతం టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే. ఒకవైపు వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతోన్న సమయంలో ఈ సుంకాలు విధించారు. అలాగే భారత్‌ను దూరం చేసుకునేలా తీవ్ర పదజాలంతో ట్రంప్ విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో వాణిజ్య శాఖ మాజీ మంత్రి అమెరికా ప్రభుత్వంపై విమర్శలు చేశారు.



### జమైకాను భయపెడుతున్న
## హరికేన్ మెలిసా


**జమైకా :** కరేబియన్ దేశం జమైకాలో హరికేన్ బీభత్సం సృష్టిస్తోంది. భారీ వరదల కారణంగా ఇప్పటికే ఇక్కడ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మెలిసా తుపాను ఈ ఏడాది భూమిపై నమోదైన హరికేన్లలో అత్యంత తీవ్రమైనదని అమెరికా వాతావరణ శాఖ నిపుణులు పేర్కొన్నారు. ఈ మెలిసా తుపాన్‌ను కేటగిరీ–5గా వర్గీకరించారు. ఇది మరింత తీవ్రతరమై.. మంగళవారం తెల్లవారుజామున కరేబియన్ ద్వీపంలో తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తుపాను నేపథ్యంలో జమైకాతో పాటు హైతీ, డొమినికన్ రిపబ్లిక్‌లలో నలుగురు మరణించారు. అమెరికాకు చెందిన నేషనల్ హరికేన్ సెంటర్ ప్రకారం.. ఈ ఏడాది భూమిపై నమోదైన అత్యంత బలమైన హరికేన్లలో మెలిసా తీవ్రమైనదని పేర్కొంది. మెలిసా కారణంగా గంటకు 280 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ సందర్భంగా కుండపోత వర్షాలతో పాటు కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌సీ డైరెక్టర్ మైఖేల్ బ్రెన్నాన్ పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. రానున్న నాలుగు రోజుల్లో జమైకాలోని కొన్ని ప్రాంతాల్లో 100 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌సీ పేర్కొంది. భారీ వరదల కారణంగా హైతీలో వందలాది ఇళ్లు మునిగిపోయాయి. జమైకా ప్రధానమంత్రి ఆండ్రూ హోల్నెస్ ప్రజలకు కీలక సూచనలు జారీ చేశారు. ప్రతిఒక్కరూ ఇంట్లోనే ఉండాలని, అధికారుల ఆదేశాలను పాటించాలని కోరారు. హరికేన్ తీవ్రతరం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను పాఠశాల బస్సుల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



## పొగడ్తలకు ఒలింపిక్స్ పెడితే షరీఫ్‌కు స్వర్ణ పతకం ఖాయం

### పాక్ మాజీ దౌత్యవేత్త

యూఎస్ : సమయం దొరికినప్పుడల్లా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పొగడ్తలతో ముంచెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా పాక్ మాజీ దౌత్యవేత్త హుస్సేన్ హక్కానీ స్పందిస్తూ.. షరీఫ్‌ను వెక్కిరించారు. ట్రంప్‌ను పొగిడేవారికి ఒలింపిక్స్ పోటీలు పెడితే పాక్ ప్రధానికి స్వర్ణ పతకం ఖాయమంటూ ఎద్దేవా చేశారు. హక్కానీ గతంలో అమెరికాలో పాక్ రాయబారిగా పనిచేశారు. ఇజ్రాయెల్– హమాస్‌ల యుద్ధం ముగింపునకు సంబంధించి ఈజిప్టులోని షర్మ్–ఎల్– షేక్‌లో శాంతి ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. ట్రంప్‌ను పొగడ్తలతో ముంచె త్తారు. ట్రంప్ అవిశ్రాంత ప్రయత్నాల వల్లే గాజాలో శాంతి నెలకొందన్నారు. ట్రంప్ ఈ ప్రపంచాన్ని శాంతి, శ్రేయస్సుతో జీవించేలా చేసేందుకు అవిశ్రా ంతంగా కృషి చేశారని.. అందుకుగాను ఆయన నోబెల్ శాంతి బహుమతికి అర్హులని ఆకాశానికెత్తారు. భారత్– పాక్ మధ్య జరిగిన ఘర్షణను కూడా ట్రంపే ఆపారంటూ క్రెడిట్ ఇచ్చేశారు. ఇటీవల జరిగిన థాయ్‌లాండ్–కంబోడియాల కాల్పుల విరమణ ఒప్పందంలోనూ అమెరికా పాత్రను ప్రశంసించారు. షరీఫ్ పదేపదే ట్రంప్‌ను పొగడడంపై స్వదేశంలోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. పాక్ ప్రధాని ట్రంప్ చేతిలో కీలుబొమ్మలా మారి.. దేశాన్ని అమ్మేశారంటూ అక్కడి ప్రజలు షరీఫ్‌ను దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడిని షరీఫ్ అంతలా పొగడాల్సిన అవసరం ఏముందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాక్‌కు చెందిన చరిత్రకారుడు అమర్ అలీ జాన్ ఇటీవల సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సమయం దొరికినప్పుడల్లా షరీఫ్ అనవసరంగా ట్రంప్‌ను ప్రశంసిస్తుండడం పాకిస్థానీయులకు ఇబ్బందికరంగా ఉందన్నారు.



## కెనడాలో పంజాబ్ యువతి హత్య..

### భారత్‌కు పరారైన అనుమానితుడు..

**కెనడా :** కెనడాలో ఓ భారత యువతి దారుణ హత్యకు గురైంది. పంజాబ్‌కు చెందిన అమన్‌ప్రీత్ సైనీ ఇటీవల తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయింది. ఈ కేసులో మరో భారతీయుడిని పోలీసులు అనుమానితుడిగా భావిస్తున్నారు. అతడి కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఇప్పటికే అతడు భారత్‌కు పారిపోయినట్లు కథనాలు వెలువడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. పంజాబ్‌లోని సంగ్రూర్‌కు చెందిన 27 ఏళ్ల సైనీ గత కొన్నేళ్ల క్రితం కెనడా వెళ్లి టొరంటోలో నివసిస్తున్నారు. గతవారం ఆమె లింకన్ ప్రాంతంలోని ఓ పార్కులో తీవ్ర గాయాలతో విగతజీవిగా కన్పించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సైనీని హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధరించిన పోలీసులు.. మరో భారతీయుడు మన్‌ప్రీత్ సింగ్‌ను అనుమానితుడిగా పేర్కొన్నారు. అతడిని వాటెండ్‌గా ప్రకటిస్తూ గాలింపు చేపట్టారు. అతడి ఫొటోను కూడా విడుదల చేశారు. అయితే ఇప్పటికే అతడు దేశం విడిచి పారిపోయినట్లుగా అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. మన్‌ప్రీత్ ఆచూకీ కోసం కెనడా అధికారిక వర్గాలు భారత్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది.

# నష్టాల్లో ముగిసిన సూచీలు






**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో మ-ుగిశాయి. రియాలిటీ, ఐటీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్జూమర్ డ్యూరబుల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నేల చూపులు చూశాయి. దీనికితోడు గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమూ సూచీలు ఒత్తిళ్లు ఎదుర్కొన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,625.71 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,778.84) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపు లాభాల్లోకి వచ్చిన సూచీ.. తర్వాత మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 84,219.39 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 150.68 పాయింట్ల నష్టంతో 84,628.16 వద్ద ముగిసింది. నిఫ్టీ 29.85 పాయింట్ల నష్టంతో 25,936.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3906 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# టీమ్ఇండియా బిజీ బిజీ

## గ్యాప్ లేకుండా సిరీస్‌ల మీద సిరీస్‌లు..

**టీమ్ఇండియా క్షణం తీరిక లేకుండా వరుస మ్యాచ్‌లతో బిజీ బిజీగా మారిపోయింది. ఒక సిరీస్‌కు, మరో సిరీస్‌కు మధ్య కనీసం వారం రోజుల విరామం కూడా ఉండట్లేదు. ఆసియా కప్ ఫైనల్ ముగిసిన నాలుగు రోజులకే వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో తలపడిన భారత జట్టు.. ఇప్పుడు ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. వన్డే సిరీస్ పూర్తయిన మూడు రోజులకే టీ20 సిరీస్ మొదలవుతోంది. వన్డేల్లో ఆడిన ఏడుగురు ఆటగాళ్లు.. టీ20 సిరీస్‌లో ఉన్నారు. అది ఎంత వైట్ బాల్ క్రికెట్ అయినా ఈ గ్యాప్ సరిపోతుందా? అనేదే ఇప్పుడు చర్చ. ఈ క్రమంలో బీసీసీఐ ప్లానింగ్, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ ఏంటి అనేది అర్థం కావడం లేదు.**



విండీస్‌తో టెస్టు సిరీస్‌లో ఆడిన 11 మంది ఆటగాళ్లు ఆసీస్‌తో వన్డే మ్యాచ్‌ల కోసం బయలుదేరారు. ఇక మూడు ఫార్మాట్‌లలో రెగ్యులర్‌గా ఆడే కొంతమంది ప్లేయర్లు నెలలతరబడి ఇంటి ముఖం చూడట్లేదు. ఇలా తీరిక లేకుండా మ్యాచ్‌లు ఆడితే ఆటగాళ్లపై పనిభారం పెరిగిపోతుంది. త్వరగా అలసిపోతారు. గాయాల బారినపడే అవకాశమూ లేకపోలేదు. శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్ ఆసియా కప్‌లో 20 రోజుల వ్యవధిలో ఏడు మ్యాచ్‌లు ఆడారు. ఆ టోర్నీ ఇలా ముగిసిందో, లేదో వెంటనే కరేబియన్ టీమ్‌తో జరిగిన తొలి టెస్టులో గిల్, కుల్‌దీప్ బరిలోకి దిగారు. విండీస్‌తో సిరీస్ ముగిసిన వెంటనే వీరు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. అక్కడి వాతావరణానికి అలవాటు పడేలోపే ప్రాక్టీస్ మ్యాచ్‌లు కూడా లేకుండానే వన్డే సిరీస్ మొదలైంది. ఇప్పుడు మూడు రోజులు గ్యాప్ ఇచ్చి ఐదు టీ20ల సిరీస్ మొదలుపెడు తున్నారు. వన్డేల్లో ఆడిన శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ టీ20 మోడ్ ఆన్ చేసి ఇటొచ్చేస్తున్నారు. ఇలా తీరిక లేని షెడ్యూల్ వల్ల ఆటగాళ్లకు సరైన విశ్రాంతి దొరకడం కష్టమవుతోంది. ఇది వ్యక్తిగత ప్రదర్శనతోపాటు జట్టు ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### పనిభారం నిర్వహణ కొందరికేనా?

కొంతమంది ఆటగాళ్ల విషయంలో మాత్రం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా అమలవుతోంది. ఆసియా కప్‌లో బుమ్రాకు రెండు మ్యాచ్‌ల్లో విశ్రాంతి ఇచ్చారు. ఈ పేసర్‌ను పనిభారం నిర్వహణ దృష్ట్యా ఆసీస్ వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు. సిరాజ్‌కు ఆసియా కప్ నుంచి రెస్ట్ ఇచ్చారు. ఆసీస్‌తో ఐదు టీ20లకు ఎంపికైన సూర్యకుమార్, అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబె వంటి ప్లేయర్లకు నెల రోజులు విశ్రాంతి దొరికింది. మూడు ఫార్మాట్లలో రెగ్యులర్‌గా ఆడుతున్న ఆటగాళ్లలో కొంతమంది ప్లేయర్ల విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ రిస్క్ చేస్తోందనే చర్చ నడుస్తోంది. వర్క్‌లోడ్ గురించి పట్టించుకోకుండా వరుసగా మ్యాచ్‌లు ఆడుతున్న ప్లేయర్లపై మేనేజ్‌మెంట్ వెంటనే ఈ పరిస్థితిపై ఫోకస్ పెట్టి ప్రత్యామ్నాయ ఆటగాళ్లను సిద్ధం చేసుకోవాల్సిన అవసరముందనే వాదనలు వినిపిస్తున్నాయి. అన్నట్లు గిల్‌ను వరుస సిరీస్‌లు గ్యాప్ ఇవ్వకుండా ఆడిస్తున్నారు ఇబ్బంది అవ్వదా అని ఆ మధ్య చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను అడిగితే.. 'కుర్రాడు కదా ఫర్వాలేదు' అన్నారు. అంటే కుర్రాళ్లతో రిస్క్ చేస్తున్నారనేగా?

### రెస్ట్ లేకపోవడమే కారణమా?

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను భారత్ 1-2తో చేజార్చుకుంది. ఈ సిరీస్‌లో గిల్, కేఎల్ రాహుల్ లాంటి కీలక ఆటగాళ్లు ఆశించిన మేర ప్రదర్శన చేయలేదు. విండీస్‌తో టెస్టు మ్యాచ్‌లు ముగియగానే సరైన విశ్రాంతి లేకుండా ఆస్ట్రేలియాకు బయలుదేరడం, అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేలోపే వన్డే సిరీస్ మొదలైంది. అప్పటివరకు భారత పిచ్‌లకు అలవాటు పడిన బ్యాటర్లు, బౌలర్లు.. ఉన్నట్టుండి మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండానే బౌన్సీ పిచ్‌లపై ఆడారు. ఇది కూడా టీమ్ఇండియా ఆటగాళ్ల ప్రదర్శనపై ప్రభావం చూపిందనే వాదనలు వినిపిస్తున్నాయి. మరి రెస్ట్ లేకుండా మ్యాచ్‌లు ఆడిస్తే ప్రదర్శన పడిపోతుందని తెలిసినా మేనేజ్‌మెంట్ ఎందుకు రిస్క్ చేస్తుందో అర్థం కావడం లేదు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉండటంతో ఇప్పటి నుంచే కీలక ఆటగాళ్ల విషయంలో మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది.

## స్మృతి మంధానకు కెరీర్‌లో బెస్ట్ రేటింగ్ పాయింట్స్



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ప్రస్తుతం జరుగుతున్న వన్డే ప్రపంచ కప్‌లో మంధాన మంచి ఆటతీరు కనబరుస్తోంది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ (109) చేసిన మంధాన.. ప్రస్తుతం 365 రన్స్‌తో టోర్నీలో టాప్ స్కోరర్‌గా ఉంది. అంతకుముందు ఆస్ట్రేలియాపై 80, ఇంగ్లాండ్‌పై 88 పరుగులు చేసింది. ఈ క్రమంలో వన్డే ర్యాంకింగ్స్‌లో ఆమె కెరీర్‌లోనే బెస్ట్ రేటింగ్ పాయింట్స్ సాధించింది. అగ్రస్థానంలో కొనసాగుతున్న స్మృతి (828)కు ఆరు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకు చేరుకున్న ఆష్లీన్ గార్డ్‌నర్ (731) మధ్య 97 పాయింట్ల వ్యత్యాసం ఉండటం గమనార్హం. లారా వొల్వార్ట్ రెండు స్థానాలు మెరుగై మూడో ర్యాంక్‌లో నిలిచింది.

## శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యం నిలకడగా ఉంది : సూర్యకుమార్ యాదవ్



సిడ్నీ వన్డేలో క్యాచ్ పట్టే క్రమంలో శ్రేయస్ అయ్యర్ తీవ్ర గాయానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతడి ఆరోగ్యం గురించి టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అప్‌డేట్ ఇచ్చాడు. ఆసీస్‌తో రేపు (బుధవారం) టీమ్ఇండియా టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు ముందు నిర్వహించే ప్రెస్ మీట్‌లో అతడు శ్రేయస్ అయ్యర్ తాజా పరిస్థితి గురించి మాట్లాడాడు. 'శ్రేయస్ అయ్యర్ గాయపడ్డాడని తెలిసినప్పుడు నేను ఫోన్ చేశాను. అతడి దగ్గర ఫోన్ లేదని తర్వాత నాకు తెలిసింది. దీంతో నేను ఫిజియోకు కాల్ చేశాను. శ్రేయస్ అయ్యర్ పరిస్థితి నిలకడగా ఉందని అతడు వివరించాడు. మొదటి రోజే కండీషన్ ఎలా ఉందో కచ్చితంగా చెప్పలేరు. కానీ రెండు రోజులుగా నేను శ్రేయస్‌తో మాట్లాడుతున్నా. అతడు ఫోన్‌లో నాకు సమాధానం ఇస్తున్నాడు. శ్రేయస్ రిప్లై ఇస్తున్నాడంటే, అతడి ఆరోగ్యం స్థిరంగా ఉందని అర్థం. ప్రస్తుతం అతడు బాగానే ఉన్నాడు. వైద్యులు నిత్యం అతన్ని పర్యవేక్షిస్తున్నారు. అతడు మరికొన్ని రోజులు వారి పర్యవేక్షణలో ఉంటాడు. శ్రేయస్ స్పందిస్తున్నాడు కాబట్టి.. ఇది మంచి పరిణామం' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. ఆసీస్ టూర్‌లో భాగంగా టీమ్ఇండియా అయిదు టీ20ల సిరీస్‌ను ఆడనుంది. రేపు కాన్‌బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌ను టీమ్ఇండియా ఇప్పటికే 2-1 తేడాతో కోల్పోయిన విషయం తెలిసిందే.


## కొత్త అవతార్‌లో డ్రీమ్11 మళ్లీ వస్తోంది




ప్రముఖ ఫాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్ 11 కొత్త అవతార్‌లో ఎంట్రీ ఇవ్వనుంది. స్టాక్ బ్రోకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలోకి ప్రవేశించనుంది. ఈ మేరకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డ్రీమ్ మనీ పేరిట స్టాక్ బ్రోకింగ్ సేవలను అందించేందుకు కంపెనీ సిద్ధమవుతోందని 'మింట్' తన కథనంలో పేర్కొంది. తద్వారా జెరోధా, ఏంజెల్ వన్, గ్రో వంటి సంస్థలకు పోటీగా డిస్కౌంట్ బ్రోకరేజీ ప్లాట్‌ఫామ్‌గా అవతరించేందుకు సిద్ధమవుతోంది. కేంద్రం తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు కారణంగా డ్రీమ్ 11 తన రియల్ మనీ గేమ్స్‌ను పూర్తిగా నిలిపివేసింది. దీంతో కంపెనీ ఆదాయం 95 శాతం మేర క్షీణించింది. ఫ్రీ టు ప్లే, యాడ్ సపోర్టెడ్ మోడల్‌కు మారినా పెద్దగా ఫలితం లేకపోవడంతో స్టాక్ బ్రోకింగ్ సేవల్లో ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించుకుంది. డ్రీమ్ 11కు ప్రస్తుతం 26 కోట్ల యూజర్ బేస్ ఉంది. వీరిని రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ మార్కెట్‌వైపు మళ్లించాలని కంపెనీ భావనగా కనిపిస్తోంది. ఒకప్పటితో పోలిస్తే స్టాక్ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పార్టిసిపేషన్ భారీగా పెరుగుతోంది. సులువుగా మార్కెట్లోకి ప్రవేశించే వీలుండడం, జీరో కమీషన్ ట్రేడింగ్ వంటి కారణంగా వీరి సంఖ్య వేగంగా వృద్ధి చెందుతోంది. అదే సమయంలో ఇప్పటికీ ప్రతి 12 మందిలో కేవలం ఒక్కరు మాత్రమే ఇన్వెస్టర్లుగా ఉన్నారు. అంటే మార్కెట్‌కు దూరంగా ఉన్న వారి సంఖ్య ఇంకా చాలా ఎక్కువగానే ఉందని నివేదికలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించడంపై డ్రీమ్ 11 దృష్టి పెట్టింది.

## అభిషేక్ శర్మను ఎదుర్కొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం

### : మిచెల్ మార్ష్




టీమ్ఇండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మను ఎదుర్కోవడానికి తమ జట్టు సిద్ధంగా ఉందని ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ అన్నాడు. ఆస్ట్రేలియాతో టీమ్ఇండియా అయిదు టీ20ల సిరీస్ ఆడనుంది. దీనిలో భాగంగా రేపు (అక్టోబర్ 29) కాన్‌బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్ష్ మాట్లాడాడు. 'అభిషేక్ శర్మ అద్భుతమైన నైపుణ్యమున్న ఆటగాడు. ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున చక్కగా ఆడాడు. అతడు నిజంగా మాకో ఛాలెంజ్. కానీ మేం అతణ్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో తలపడి మనల్ని మనం పరీక్షించుకోవాలి' అని మిచెల్ మార్ష్ అన్నాడు. అలాగే జోష్ ఇంగ్లిస్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండే విషయమై మార్ష్ మాట్లాడాడు. అతడు ఇటీవల న్యూజిలాండ్ సిరీస్‌లో గాయం వల్ల ఆసీస్ జట్టుకు దూరమయ్యాడు. 'జోష్ ఇంగ్లిష్ ఫిట్‌నెస్ సాధించాడు. జట్టుకు అందుబాటులో ఉన్నాడు. అతడు మాకు చాలా ముఖ్యమైన ఆటగాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడు' అని మార్ష్ వివరించాడు. అభిషేక్ శర్మ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. అతడు 23 ఇన్నింగ్స్‌ల్లో 36.91 యావరేజ్‌తో 849 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు, అయిదు అర్ధశతకాలున్నాయి. టీమ్ఇండియా, ఆస్ట్రేలియా ఇప్పటి వరకు 32 టీ20ల్లో తలపడింది. అందులో 20 మ్యాచుల్లో భారత జట్టు విజయం సాధించింది. ఆసీస్ జట్టు 11 మ్యాచుల్లో గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.



## అమెజాన్‌లో 14 వేల ఉద్యోగాలకు కోత

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైంది. 14 వేల కార్పొరేట్ ఉద్యోగాలను తొలగించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెజెన్స్‌పై పెద్దఎత్తున ఖర్చు చేస్తున్న నేపథ్యంలో ఉద్యోగాల తొలగింపును అమెజాన్ ప్రకటించింది. అంతకుముందు అమెజాన్‌లో దాదాపు 30 వేల ఉద్యోగాల తొలగింపు ఉంటుందని ప్రచారం వేళ ఆ సంస్థ నుంచి అధికారికంగా ఈ ప్రకటన వెలువడింది. కస్టమర్ల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త పంథాలో ముందుకెళుతున్నామని అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెతత్ గలెట్టి ఉద్యోగులకు రాసిన సందేశంలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే బ్యూరోక్రసీని తగ్గించి, అనవసర లేయర్లను తొలగిస్తున్నామని, వనరులను సంపూర్ణంగా వినియోగించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. గతేడాది అమెజాన్ సీఈఓ యాండీ జెస్సీ ఉద్యోగులకు రాసిన లేఖను కూడా మెమోకు జత చేశారు. లేఆఫ్‌ల కారణంగా ఉద్యోగుల కోల్పోయిన వ్యక్తులు, టీమ్స్‌ను త్వరలో నోటిఫై చేయనున్నారు. అమెజాన్‌లో 30 వేల ఉద్యోగాలను తొలగిస్తారంటూ తొలుత ప్రచారం జరిగింది. అమెజాన్‌లో దాదాపు 3,50,000 మంది కార్పొరేట్ ఉద్యోగులు పనిచేస్తుండగా.. వారిలో 10 శాతానికి సమానమైన 30వేల మందిని తప్పిస్తారంటూ 'రాయిటర్స్' వార్తా సంస్థ పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెజాన్ నుంచి అధికారికంగా ఉద్యోగాల తొలగింపు ప్రకటన వెలువడింది. అమెజాన్ గత రెండేళ్లుగా పరికరాలు, కమ్యూనికేషన్లు, పాడ్‌కాస్టింగ్ సహా ఇతర విభాగాల్లోని ఉద్యోగులను తగ్గిస్తూ వచ్చింది. అమెజాన్ సీఈఓగా యాండీ జెస్సీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి లేఆఫ్‌ల పర్వం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఉన్నది ఏఐ శకం అని జెస్సీ పలుమార్లు పేర్కొన్నారు.

## వికీపీడియాకు పోటీగా ఎలాన్ మస్క్ ఏఐ గ్రోకిపీడియా




బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏఐ అంకుర సంస్థ 'ఎక్స్‌ఏఐ' తాజాగా మరో సంచలనానికి నాంది పలికింది. వికీపీడియాకు ప్రత్యామ్నాయంగా గ్రోకిపీడియా ను రూపొందించింది. ఇది ఏఐ ఆధారంగా పని చేస్తుంది. గ్రోకిపీడియా మంగళవారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రారంభంలో సర్వర్ సమస్యల వల్ల కొద్దిసేపు డౌన్ అయినా తర్వాత స్థిరంగా పనిచేయడం ప్రారంభించింది. విస్తృత వనరుల నుంచి సేకరించిన వాస్తవ సమాచారాన్ని ఏఐ ఆధారంగా ప్రాసెస్ చేసి వినియోగదారులకు అందిస్తుంది. గ్రోకిపీడియాలో ప్రస్తుతం 8,85,000 వ్యాసాలు అందుబాటులో ఉన్నాయి. చాట్‌జీపీటీ లేదా గ్రోక్ వంటి సంభాషణాత్మక ఏఐ మోడళ్లలా కాకుండా, గ్రోకిపీడియా ప్రస్తుతం కీవర్డ్ సెర్చ్ విధానంలో పనిచేస్తుంది. ఉదాహరణకు Barcelona అని టైప్ చేస్తే దానికి సంబంధించిన సంక్షిప్త సమాచారం చూపిస్తుంది. ప్రస్తుతం ఉన్న వికీపీడియా వంటి వేదికల్లో ఎడిటోరియల్, పక్షపాత ధోరణులు ఉన్నాయని, గ్రోకిపీడియా వాటికి ప్రత్యామ్నాయంగా నిష్పక్షపాతంతో ధ్రువీకరించిన సమాచారాన్ని మాత్రమే అందిస్తుందని మస్క్ తెలిపారు. అయితే గ్రోకిపీడియా కంటెంట్‌లో లోపాలు, అసమానతలపై యూజర్ల నుంచి విమర్శలు రావడంతో మస్క్ వాటిపై స్పందించారు. గ్రోకిపీ డియా ప్రారంభదశలో ఉందని, భవిష్యత్తులో తీసుకొచ్చే అప్‌డేట్స్‌తో కచ్చిత త్వం, నమ్మకాన్ని అందిస్తామని తెలిపారు. ప్రస్తుత ఉన్న వెర్షన్ కంటే రాబోయే 1.0 వెర్షన్ పది రెట్లు మెరుగ్గా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫాంకు అధికారిక మొబైల్ యాప్స్ లేనందున ఎటువంటి థర్డ్‌పార్టీ యాప్స్‌ను వాడొద్దని మస్క్ సూచించారు. వినియోగదారులు grokipedia.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఎక్స్ ఖాతాతో లాగిన్ అవ్వడం ద్వారా దీన్ని ఉపయోగించవచ్చు.





## రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేసిన భారత రిఫైనరీలు..

ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు విషయంలో రష్యా తీరుపై ఆగ్రహంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆ దేశ చమురు సంస్థలపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదు. తాత్కాలికంగా చమురు కొనుగోలును నిలిపివేశాయి. ఆంక్షలపై మరింత స్పష్టత కోసం వేచిచూసే వైఖరిని అనుసరిస్తున్నాయి. స్పాట్ మార్కెట్ల నుంచి కొనుగోళ్లతో ఆ లోటును భర్తీ చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని రిఫైనరీలకు చెందిన కీలక వ్యక్తులు మంగళవారం వెల్లడించినట్లు ఎకనామిక్ టైమ్స్ కథనం పేర్కొంది. రష్యా సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌తో పాటు వాటి అనుబంధ సంస్థల నుంచి అమెరికా కంపెనీలు, వ్యక్తులు చమురు కొనకుండా అక్టోబరు 22న అగ్రరాజ్యం నిషేధం విధించింది. అమెరికాయేతర సంస్థలు కొనుగోలు చేసినా, పెనాల్టీ ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. ఈ రెండు సంస్థలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి ముగించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత ముడి చమురు దిగుమతుల్లో మూడో వంతు రష్యా నుంచే వస్తోంది. 2025లో ఇప్పటివరకు సగటున రోజుకు 1.7 మిలియన్ బారెళ్ల (ఎంపీడీ) చమురును మనం దిగుమతి చేసుకున్నాం. ఇందులో 1.2 ఎంపీడీ ఆ రెండు సంస్థల నుంచే వచ్చింది. ఇందులో ఎక్కువ భాగాన్ని రిలయన్స్, నయారా వంటి ప్రైవేటు సంస్థలే కొనుగోలు చేశాయి. పాశ్చాత్య దేశాల నుంచి ఆంక్షలు పెరగడంతో, ముడిచమురు కొనుగోలు కోసం మన కంపెనీలు పశ్చిమాసియా వైపు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పందించిన సంగతి తెలిసిందే. రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతులపై ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటామని తెలిపింది. అమెరికా, బ్రిటన్, ఈయూ ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని పేర్కొంది. ఆంక్షల అమలు, నియంత్రణ చట్టాలకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. అమెరికాకు సహకరిస్తామన్న సంకేతాలను అందించేందుకు భారత రిఫైనరీలు అమెరికా కంపెనీల నుంచి చమురు బుకింగ్ పెంచుకున్నట్లు వాణిజ్య, ప్రభుత్వ వర్గాల సమాచారం.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక



# ఫౌజీ మూవీలో యంగ్ ప్రభాస్‌గా దర్శన్




సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు, మహేశ్ బాబు బావ సుధీర్ బాబు ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో హీరోగా తనకంటూ ఓ గుర్తింపును సంపాదించుకున్నాడు. కృష్ణ చిన్నకూతురు ప్రియదర్శిని భర్త అయిన సుధీర్ బాబు తన కొడుకులనూ సినిమా రంగంలోకే తీసుకొస్తుండటం విశేషం. ప్రియదర్శిని, సుధీర్ బాబు జంటకు ఇద్దరు కొడుకులు. పెద్దబ్బాయి చరిత మానస్. ఇతను గతంలో 'భలే భలే మొగాడివోయ్' చిత్రంలో చిన్నప్పటి నాని (ఔజీనితి) గా నటించాడు. అలానే చిన్న కొడుకు దర్శన్ కూడా కొన్ని సినిమాల్లో నటించాడు. 2018లో వచ్చిన 'గూఢచారి'లో చిన్నప్పటి అడివి శేష్ గానూ, 2022లో వచ్చిన 'సర్కారు వారి పాట'లో చిన్నప్పటి మహేశ్ బాబు గానూ దర్శన్ నటించాడు. తాజాగా సుధీర్ బాబు తనయుడు దర్శన్ 'ఫౌజీ' మూవీలో యంగ్ ప్రభాస్ గా నటిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా అతని తండ్రి సుధీర్ బాబు తెలిపాడు. సుధీర్ బాబు నవంబర్ 7న విడుదల కాబోతున్న తన తాజా చిత్రం 'జటాధర' ప్రమోషన్స్ సమయంలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ సినిమాలో భారీ సంస్కృత సంభాషణలు ఉన్నాయని, వాటిని చాలా సులువుగా, సునాయాసంగా దర్శన్ చెప్పేశాడని యూనిట్ సభ్యులు అంటున్నారు. 'ఫౌజీ' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న 'ఫౌజీ'తో ప్రభాస్ సరసన ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోంది.

## లక్కీ చాన్స్ దక్కించుకున్న ఐశ్వర్య రాజేష్

భాషతో సంబంధం లేకుండా వరుస చిత్రాల్లో నటిస్తూ ఐశ్వర్య రాజేష్ ఇండస్ట్రీలో రాణిస్తోంది. పలు హిట్స్ తన ఖాతాలో వేసుకున్నప్పటికీ తెలుగులో పెద్దగా ఫేమ్ దక్కించుకోలేకపోయింది. స్టార్ హీరోలతో సినిమాలు చేయడంతో పాటు లేడీ ఓరియంటెడ్ కథల్లోనూ నటించి మెప్పించింది. ఇక ఇటీవల తెలుగులో 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో సూపర్ హిట్ సాధించడంతో పాటు చెరగని ముద్ర వేసుకుంది. అయినప్పటికీ ఆ తర్వాత ఎలాంటి సినిమాల్లో అవకాశం దక్కించుకోలేకపోయింది. కొన్ని తమిళ చిత్రాలకు సెలెక్ట్ చేసుకున్నప్పటికీ తొలగించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. తాజాగా, ఐశ్వర్య రాజేష్ ఓ లక్కీ చాన్స్ దక్కించుకున్నట్లు పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడు ఓ లక్కీ చాన్స్ దక్కించుకున్నట్లు టాక్. లేడీ ఓరియంటెడ్ చిత్రంగా రాబోతుండగా... హారర్ మూవీ 'మసూద'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సాయి కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు సమాచారం. ఆయనకు కూడా ఈ విజయం తర్వాత ఎలాంటి అవకాశం రాకపోవడంతో లేడీ ఓరియంటెడ్ చిత్రాన్ని తెరకెక్కించాలని నిర్ణయించుకున్నారట. ఈ సినిమాను మహేశ్వర్ రెడ్డి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఓ బ్లాక్ బస్టర్ హిట్ సినిమా తర్వాత ఐశ్వర్య రాజేష్‌కి ఇప్పటి వరకు ఎలాంటి అవకాశం రాకపోవడంతో ఇది లక్కీ చాన్స్ అని అంతా అంటున్నారు. అలాగే దర్శకుడు సాయి, నిర్మాత మహేశ్వర్ రెడ్డికి కూడా చెప్పుకోదగ్గ సినిమాలేవి లేదు. అలాంటి ఈ ముగ్గురి కాంబోలో రాబోతున్న మూవీ కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

# ఎంగేజ్‌మెంట్‌పై రష్మిక ఆసక్తికర సమాధానం

### మీకేమి అనిపిస్తుందో అదే నిజం.. ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతానంటూ రిప్లై



విజయ్ దేవరకొండతో తన ఎంగేజ్‌మెంట్‌పై నటి రష్మిక ఆసక్తికర సమాధానం చెప్పి తప్పించుకున్నారు. రష్మిక తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో రష్మికను ఓ అభిమాని విజయ్‌తో నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం' అని అన్నారు. ప్రస్తుతం రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశాల్లో పాల్గొంటూ జోష్ పెంచుతున్నారు. తనకెంతో ఇష్టమైన 'డియర్ కామ్రేడ్' గురించి మాట్లాడారు. అలాగే విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ పైనా స్పందించారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కాకుండా కొన్నేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే ఉపయోగం లేదని ఆమె అన్నారు. విజయ్ దేవరకొండ, ఆమె జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. 2019లో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఈ సినిమా తమకెంతో ప్రత్యేకమని విజయ్, రష్మిక ఎన్నో సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా రష్మిక దీనిపై స్పందిస్తూ.. అప్పుడు ఆదరణ దక్కలేదని.. కానీ, ఇప్పుడు యూట్యూబ్‌లో అందరూ దీని గురించే మాట్లాడుకుంటున్నారని అన్నారు. డియర్ కామ్రేడ్'ను థియేటర్‌లో ఆడియన్స్‌తో పాటు చూశాను. కానీ, మేం ఆశించిన ఫలితం రాలేదు. నా దృష్టిలో ఇప్పటికీ అది ఒక గొప్ప చిత్రమే. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా 'దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్ల డానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం' అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో 'డియర్ కామ్రేడ్' గురించి పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు. ఒక సినిమా కోసం దర్శకనిర్మాతలు ఎంతో కష్టపడతారు. దానికి తగిన ఫలితం రాకపోతే నిజంగా బాధగా ఉంటుంది. ఆ సమయంలో ఆదరించకుండా రెండు, మూడేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే బాధగా ఉంటుందని తెలిపారు.

# ఉగాదికి అడవిశేష్ డెకాయిట్




అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' . తాజాగా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 2026 ఉగాదిని పురస్కరించుకుని మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయనున్నారు. సంబంధిత పోస్టర్‌ను అడివి శేష్ సోషల్ మీడియాలో పంచుకుంటూ.. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకు వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరం లేదు' అని క్యాప్షన్ పెట్టారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే. విభిన్న ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ, ఆమె స్థానంలో ఇప్పుడు మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. డిసెంబరు 25న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం గతంలో వెల్లడించగా.. ఇప్పుడు వాయిదా వేసింది. అడివిశేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం డెకాయిట్ ముందుగా వచ్చిన వార్తల ప్రకారం క్రిస్మస్‌కు ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. అయితే ఎవరూ ఊహించని విధంగా కొత్త తేదీ ప్రకటిస్తామంటూ తెలిపారు మేకర్స్. ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ జీప్‌లో ఉండగా.. ఈ ఇద్దరూ గన్‌తో శత్రువులను ఎదుర్కొంటూ తమను తాము రక్షించుకుంటున్న కొత్త పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ మూవీని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.




## ఖైదీ మూవీకి 42 ఏళ్లు

అగ్ర కథానాయకుడు చిరంజీవి కెరీర్‌లోని హిట్ సినిమాలు అనగానే గుర్తొచ్చే మొదటి పేరు 'ఖైదీ' . 1983లో విడుదలైన ఈ చిత్రం చిరంజీవిని స్టార్ హీరో చేసింది. 'ఖైదీ' విడుదలై నేటికి 42 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరంజీవి టీమ్ ఓ స్పెషల్ వీడియోను పంచుకుంది. తెలుగు సినిమా చరిత్రలో మార్పు తీసుకువచ్చిన పేరు 'ఖైదీ అని పేర్కొంది. ఈ సినిమా అప్పట్లో సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇందులో చిరు సరసన మాధవి నటించింది. మిగతా పాత్రల్లో రావుగోపాలరావు, నూతన్ ప్రసాద్, రంగనాథ్, సంగీత తదితరులు నటించారు.



## మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రణయం

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఓ తీర ప్రాంతంలో చిత్రీకరణ చేసుకుంటోంది. ఈ తొలి షెడ్యూల్‌లో భాగంగా విజయ్ – కీర్తిలపై ప్రేమ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్ నవంబరు 7వరకు కొనసాగనున్నట్లు తెలిసింది. ఇది గ్రామీణ నేపథ్యంగా సాగే యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ప్రేమ, రాజకీయ అంశాలతో మిళితమై ఉంటుంది. ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి 'రౌడీ జనార్దన' అనే పేరు పరిశీలనలో ఉంది.

# ఉప్పెన లెవల్లో డ్యూడ్ విజయం



మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ కొత్త దర్శకులకు దన్నుగా నిలుస్తారనే విషయం మరోసారి రుజువైంది. అప్పట్లో వైష్ణవ్ తేజ్ , కృతిశెట్టిని హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'ఉప్పెన' సినిమాను నిర్మించింది. ఆ మూవీతో బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కొత్త వాళ్ళతో తీసిన 'ఉప్పెన' సినిమా ఘన విజయాన్ని సాధించింది. ఏకంగా వంద కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. సింగిల్ లాంగ్వేజ్ లోనే ఆ సినిమా ఆ రికార్డ్ ను సాధించడం విశేషం. ఓ కొత్త హీరో, హీరోయిన్ల సినిమా ఆ స్థాయి వసూళ్ళను గతంలో ఎప్పుడూ చేయలేదు. అయితే దానిని నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థే ఇప్పుడు అదే రికార్డ్ ను రిపీట్ చేసింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'డ్యూడ్' మూవీని నిర్మించింది. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమాతో కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయం అయ్యాడు. గతంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించి 'లవ్ టుడే', 'డ్రాగన్' చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఇప్పుడు 'డ్యూడ్' సైతం చక్కని విజయాన్ని అందుకుని అతనికి హ్యాట్రిక్ ను అందించింది. ఈ సినిమా ఇంతవరకూ వంద కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సైతం హర్షం వ్యక్తం చేసింది. 'ఉప్పెన' తర్వాత నూతన దర్శకుడితో తాము తీసిన 'డ్యూడ్' సైతం వందకోట్ల గ్రాస్ వసూలు చేయడం ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లోనూ కొత్త దర్శకులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తామని తెలిపింది.

## రామాయణ పారితోషికం

# క్యాన్సర్ బాలలకు విరాళం

### పెద్ద మనసు చాటుకున్న వివేక్ ఒబెరాయ్




బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ తన గొప్పమనసుతో మరోసారి వార్తల్లో నిలిచారు. అగ్ర దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం సినిమాలో రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో కథానాయకుడిగా నటిస్తుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటించబోతుంది. రావణుడిగా యష్ నటిస్తున్నాడు. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ విభీషణుడి పాత్రలో నటించబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ పాత్రకు సంబంధించిన పారితోషికంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు వివేక్. 'రామాయణం' సినిమాకు తాను అందుకునే పూర్తి పారితోషికాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వివేక్ ప్రకటించారు. తన జీవితంలో ఏది చేసినా పూర్తి ప్రేమతోనే చేస్తానని చెప్పిన వివేక్ తన పారితోషికాన్ని క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లల సహాయార్థం విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు. చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రాకు నేను స్పష్టంగా చెప్పాను ఈ సినిమాకు 'నాకు ఒక పైసా కూడా వద్దు'. నేను బలంగా నమ్మే ఒక మంచి కారణం కోసం ముఖ్యంగా క్యాన్సర్ పిల్లల వైద్యం కోసం ఈ మొత్తాన్ని వినియోగించాలనుకుంటున్నాను అని వివేక్ ఒబెరాయ్ వెల్లడించారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com